తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : గడ్డం నాగరాజు
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...
హైదరాబాద్
బుధవారం
6 మార్చి 2024
సంపుటి : 01
సంచిక :278
పేజీలు : 8
వెల రూ.5.00
Epaper : WWW.tharangalu.comEpa
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna



## ప్రపంచ కుబేరుడిగా అమెజాన్ అధినేత

తరంగాలు-న్యూఢిల్లీ

ప్రపంచంలోనే అపరకుబేరుడిగా ఉన్న ఎలాన్ మస్క్‌కు భారీ షాక్ తగిలింది. 9 నెలల కాలంలో తొలిసారి బ్లూమ్‌బెర్గ్ వరల్డ్ రిచెస్ట్ బిలియనీర్ జాబితాలో స్థానాన్ని కోల్పోయారు. టెస్లా కంపెనీ షేర్లు 7.2 శాతం కుప్పకూలిపోయింది. దీంతో.. బిలియనీర్ల లిస్టులో తొలిస్థానంలో ఉన్న మస్క్ రెండో స్థానానికి పడిపోయారు. అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్ 200.3 బిలియన్ డాలర్ల సంపదతో తొలిస్థానాన్ని దక్కించుకున్నారు. ప్రస్తుతం మస్క్ నెట్‌వర్త్ 198 బిలియన్లుగా ఉంది. జెఫ్ బెజోస్.. ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడిగా మొదటిస్థానంలో నిలిచి రెండేళ్లు దాటింది. ఇప్పుడు మళ్లీ ఆధిక్యంలోకి వచ్చాడు. మంగళవారం నాటికి.. బ్లూమ్ బెర్గ్ -మిగతా 2 లో



# రాష్ట్రాలను లూటీ చేస్తున్న కుటుంబ పార్టీలు

- కుటుంబ పాలనకు నేను పూర్తిగా వ్యతిరేకం
- దేశ ప్రజలే నా కుటుంబం అన్న ప్రధాని
- భారత్‌ను మూడో ఆర్థికశక్తిగా తీర్చిదిద్దుతా
- సంగారెడ్డి సభలో విపక్షాలను ఏకిపారేసిన మోడీ

తరంగాలు-సంగారెడ్డి,

తెలంగాణ ప్రజలు చూపిస్తున్న ప్రేమ, ఆదరణను వృథా కానివ్వనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మనమంతా కలిసి దేశాన్ని ప్రపంచంలోనే అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలన్నారు. ప్రపంచంలో తెలుగు వారి ఖ్యాతి వ్యాప్తిచెందిందని.. ఇది దేశానికి గర్వకారణమని చెప్పుకొచ్చారు. మంగళవారం సంగారెడ్డిలో ప్రధాని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం పటేల్‌గూడలో ఏర్పాటు చేసిన సభలో.. నా తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ నమస్కారాలు అంటూ మోదీ తెలుగులో ప్రసంగం మొదలుపెట్టారు. తెలంగాణను రెండింతలు అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఇది మోదీ గ్యారెంటీ.. మోదీ గ్యారెంటీ అంటే గ్యారెంటీగా పూర్తయ్యే గ్యారెంటీ అని స్పష్టం చేశారు. కశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు చేస్తామని చెప్పామని. చేశామా? లేదా? అయోధ్య రాముడి ప్రాణ ప్రతిష్ట చేస్తామని చెప్పాం.. చేశామా.. లేదా.. మోదీ ఇచ్చిన గ్యారెంటీ.. నెరవేరిందా? లేదా? అని అన్నారు.ప్రపంచంలోనే -మిగతా 2 లో



## బిఆర్ఎస్‌కు వరుస దెబ్బలు

-పార్టీని వీడుతున్న నాయకులు పార్లమెంట్ ఎన్నికలు లక్ష్యంగా జారుకుంటున్న నేతలు

తరంగాలు-హైదరాబాద్

తెలంగాణలో అధికారాన్ని కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. బీఆర్ఎస్ లో పదవులు అనుభవించిన నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో...నేతలంతా తమ దారి తాము చూసుకుంటు న్నారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే సామెతను పక్కాగా అనుసరిస్తున్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉండాల్సిన నేతలంతా...పక్క చూపులు చూస్తున్నారు. వారంరోజుల వ్యవధిలో ఇద్దరు ఎంపీలు -మిగతా 3 లో




## సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఈసీ సిద్ధం

-ఈ నెల 13న వెలువడే అవకాశం

తరంగాలు-న్యూఢిల్లీ,

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నద్ధమైంది. మార్చి 13న పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ రిలీజ్ అవుతుందని వార్తలు వస్తున్నాయి. లోక్ సభ ఎన్నికలతోపాటు కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని ఇప్పటికే ఈసీ ప్రకటించింది. 2019లో సార్వత్రిక ఎన్నికలకు మార్చి 10న షెడ్యూల్ విడుదలైంది. ఏప్రిల్ 11 నుంచి మే 19 వరకు ఏడు విడతల్లో పోలింగ్ నిర్వహించారు. మే 23 ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఇప్పుడు ఇంచుమించు ఇదే విధంగా షెడ్యూల్ ఉంటుందని భావిస్తున్నారు. ప్రధాని మోదీ మార్చి 12 వరకు -మిగతా 3 లో

# ఎన్నికల తరవాత విశాఖే రాజధాని

- ఇక్కడే సిఎంగా ప్రమాణం చేస్తా
- విశాఖ అభివృద్ధికి కట్టుబడి ఉన్నా
- విశాఖ రాకుండా అడ్డంకుల సృష్టి
- విశాఖ విజన్ సదస్సులో సిఎం జగన్ సంచలన వ్యాఖ్యలు



తరంగాలు-విశాఖపట్టణం

విజన్ విశాఖ సదస్సులో సీఎం జగన్ మోహన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత వైజాగ్ నుంచే పాలన చేపడతామన్నారు. మళ్లీ గెలిచిన తర్వాత వైజాగ్‌లోనే ప్రమాణ స్వీకారం చేస్తానని అదే తన కమిట్‌మెంట్ అంటూ కామెంట్ చేశారు. విశాఖలో విజన్ విశాఖ సదస్సు ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఓ ప్రైవేటు హోటల్‌లో రెండు రోజుల పాటు కార్యక్రమం జరగనుంది. మొదటి రోజు సదస్సును ప్రారంభించిన సీఎం జగన్ వైజాగ్ వనరులను పారిశ్రామికవేత్తలకు వివరించారు. దేశంలోని మిగతా నగరాలతో పోల్చుకుంటే వైజాగ్ చాలా త్వరగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు.. స్థిరత్వమైన -మిగతా 2 లో

## నేటికీ మంచినీటికి నోచుకోని పదిలక్షల ఆవాసాలు

- తెలంగాణలో గ్రామీణ నీటి సరఫరాకి సహకరించండి
- జల్‌జీవన్ మిషన్ ద్వారా నిధులు కేటాయించాలి
- ప్రధాని మోడీకి వినతిపత్రం అందచేసిన సిఎం రేవంత్ రెడ్డి



తరంగాలు-హైదరాబాద్

రెండు రోజుల తెలంగాణ పర్యటనకు విచ్చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు అంవాలకు సంబంధించి విజ్ఞప్తులు అందచేశారు. వాటిని సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని కోరారు. రాష్ట్రంలో నూటికి నూరు శాతం ఇంటింటికీ నల్లా నీటిని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరారు. దాదాపు పది లక్షల కుటుంబాలకు ఇప్పటికీ నల్లా నీళ్లు అందటం లేదు. సమీపంలోని నీటి వనరుల ద్వారా గ్రామాలకు రక్షిత మంచినీటిని సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జల జీవన్ మిషన్ నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్టీపీసీలో 4000 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం ఉంటే గత ప్రభుత్వం 1600 మెగావాట్లు మాత్రమే సాధించింది. మిగిలిన 2400 మెగావాట్ల -మిగతా 2 లో

# కాంగ్రెస్, బీజేపీతో తెలంగాణకు ముప్పు



- లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ - బీఎస్పీ మధ్య పొత్తు..!
- కేసీఆర్‌ను కలిసినందుకు ఆనందంగా ఉంది
- కేసీఆర్‌తో కలిసి రాష్ట్రాన్ని కాపాడుకుంటాం
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

తరంగాలు- హైదరాబాద్ :

త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ - బీఎస్పీ పార్టీల మధ్య పొత్తు కుదిరింది. రాష్ట్రంలోని 17 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌తో కలిసి పోటీ చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిర్ణయించారు. పొత్తు అంశంపై బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడితో కేసీఆర్ నిర్ణయించారు. బంజారాహిల్స్‌లోని నంది నగర్ నివాసంలో కేసీఆర్‌ను ప్రవీణ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ భేటీ సందర్భంగా పొత్తుపై చర్చించారు. కాంగ్రెస్, బీజేపీతో తెలంగాణకు ముప్పు ఉందని, అందుకే బీఆర్ఎస్‌తో కలిసి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో సమావేశం ముగిసిన అనంతరం ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. -మిగతా 2 లో

## లక్షలాది మంది అర్హులకు అన్యాయం

-ఒక్క యూనిట్ ఎక్కువ వచ్చినా మొత్తం బిల్లు వసూలు
-బిల్లింగ్ వ్యవస్థలో మార్పులు చేయాలి
-సీఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు బహిరంగ లేఖ



తరంగాలు-హైదరాబాద్,

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో 200 యూనిట్లలోపు విద్యుత్ వాడుకునే వినియోగదారులకు ఎలాంటి బిల్లు వసూలు చేయవద్దనే ప్రభుత్వ పథకంలో జరుగుతున్న పొరపాటు వల్ల లక్షలాది మంది అర్హులకు అన్యాయం-మిగతా 2 లో

# కాంగ్రెస్, బీజేపీతో తెలంగాణకు ముప్పు



(మొదటి తరువాయి)

ఈ రోజు కేసీఆర్‌ను కలిసినందుకు ఆనందంగా ఉంది. సెక్యులరిజం ప్రమాదంలో ఉన్నది. ఈ దేశాన్ని చిన్నాభిన్నం చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తుంది. రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు కూడా కుట్ర చేస్తోంది. లౌకికత్వాన్ని నిరంతరం కాపాడిన కేసీఆర్‌తో కలిసి.. ఈ రాష్ట్రాన్ని కాపాడుకుంటాం. మాయావతి ఆశీస్సులతో ముందుకు వెళ్తాం. కాంగ్రెస్, బీజేపీ పార్టీల ముప్పు నుంచి తెలంగాణను కాపాడేందుకు బీఆర్ఎస్‌తో కలిసి పని చేయాలని నిర్ణయించాం. తప్పకుండా సీట్ల సర్దుబాటు చేసుకుని తర్వాత కార్యాచరణ ప్రకటిస్తాం. మాయావతితో కూడా తప్పకుండా మాట్లాడుతారు కేసీఆర్. తెలంగాణ ప్రజల జీవితాలను మారుస్తుంది ఈ స్నేహం. బహుజన వర్గాల జీవితాలు తప్పకుండా బాగుపడుతాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలలు అవుతోంది. ఈ ప్రభుత్వం పట్ల నిరుద్యోగులు సంతోషంగా లేరు. నిరుద్యోగులు రోడ్ల మీదకు వచ్చే పరిస్థితి ఉంది. ఐకమత్యంగా ఉంటాం. తెలంగాణ ప్రజలు ఆశీర్వదిస్తారని మాకు నమ్మకం ఉంది అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# ప్రపంచ కుబేరుడిగా అమెజాన్ అధినేత

(మొదటి తరువాయి)

**బిలియనీర్స్** ఇండెక్స్ ప్రకారం.. అమెజాన్ వ్యవస్థాపకుడు బెజోస్ 200 బిలియన్ డాలర్ల నికర విలువతో ప్రపంచంలోనే అత్యంత సంపన్నవ్యక్తిగా నిలిచారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బూమ్ నేపథ్యంలో బిగ్ టెక్ షేర్లలో నిరంతర లాభాల తర్వాత బెజోస్ అగ్రస్థానాన్ని తిరిగి పొందాడు. బెజోస్ చివరిసారిగా 2021లో ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా నిలిచాడు. అమెజాన్ షేర్లు ఈ సంవత్సరం వరకు 17% పెరిగాయి. ఇది ఒక సంవత్సరం క్రితం కంటే దాదాపు 90% ఎక్కువ. ప్రపంచంలోనే అతిపెద్ద ఆన్‌లైన్ రిటైలర్ అయిన అమెజాన్‌లో బెజోస్ 9% వాటాను కలిగి ఉన్నాడు. దాని స్టాక్ విలువ పెరగడంతో.. అతని ఆస్తుల నికర విలువ కూడా పెరిగింది. బ్లూమ్‌బెర్గ్ ప్రకారం.. ఒకానొక సమయంలో బెజోస్ కంటే మస్క్ %వి%142 బిలియన్ల సంపదతో ధనవంతుడు. 2017లో మైక్రోసాఫ్ట్ కోఫౌండర్ బిల్ గేట్స్‌ను.. బెజోస్ ప్రపంచంలోనే అత్యంత సంపన్న వ్యక్తిగా అధిగమించాడు. టెస్లా షేర్ల పెరుగుదల నేపథ్యంలో 2021లో బెజోస్ స్థానాన్ని మస్క్ కైవసం చేసుకున్నాడు. మస్క్, బెర్నార్డ్ ఆర్నాల్ట్, చైర్మన్, ఇప్పుడు బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్‌లో రెండవ, మూడవ అత్యంత సంపన్న వ్యక్తులు. ప్రస్తుతం వారి నికర విలువలు వరుసగా %వి%198 బిలియన్లు మరియు %వి%197 బిలియన్లుగా ఉన్నాయి. ఇప్పటి వరకూ టెస్లా స్టాక్ విలువ 24 శాతం తగ్గింది. గతేడాది కంటే ఇది 3 శాతం తక్కువ. ఫిబ్రవరి నెలలో చైనాలో అమ్మకాలు క్షీణించడంతో ఈసీ తయారీదారు షేర్లు సోమవారం 7 శాతం పడిపోయాయి. మెటాసీఈఓ మార్క్ జుకర్ బర్గ్ 179 బిలియన్ డాలర్లతో నాల్గవ స్థానంలో, 150 బిలియన్ డాలర్లతో బిల్ గేట్స్ ఐదవ స్థానంలో ప్రపంచ సంపన్నులుగా నిలిచారు.

# లక్షలాది మంది అర్హులకు అన్యాయం

(మొదటి తరువాయి)



జరుగుతుంది అని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కేవలం 200 యూనిట్ల వరకు వినియోగించిన వారికి అధికారులు జీరో బిల్లు ఇస్తున్నారు.. కానీ, ఒక్క యూనిట్ ఎక్కువ వచ్చినా సరే మొత్తం 201 యూనిట్లకు బిల్లు వసూలు చేస్తున్నారు అని పేర్కొన్నారు. వినియోగదారులు ప్రతీ రోజు పొద్దున లేచి తాము ఎంత కరెంటు కాలుస్తున్నాము? మీటర్ ఎంత తిరుగుతుంది? అనేది చూసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆయన మండిపడ్డారు. 200 యూనిట్లు దాటితే 200 యూనిట్ల వరకు అయ్యే భారాన్ని ప్రభుత్వమే భరించి.. మిగతా యూనిట్ల ధరను వినియోగదారుడు చెల్లించే విధంగా బిల్లింగ్ వ్యవస్థలో మార్పులు చేయాలని హరీశ్ రావు విన్నవించుకున్నారు. ఇక, తెలంగాణ రాష్ట్రంలో 90 లక్షల మంది తెల్లరేషన్ కార్డులుంటే.. ప్రభుత్వం కేవలం 30 లక్షల మందికి మాత్రమే ఈ పథకాన్ని అమలు చేస్తుందని హరీశ్ రావు అన్నారు. మిగతా 60 లక్షల మందికి తీవ్ర అన్యాయం జరుగుతుంది.. హైదరాబాద్ నగరంలో కూడా 30 లక్షల మంది పేదలుంటే, కేవలం 10 లక్షల మందికే పథకం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.. కేవలం మూడో వంతు పేదలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది.. రెండు వంతుల పేదలను విస్మరిస్తున్నారు.. ఇది సరైంది కాదు అని ఆయన పేర్కొన్నారు. ఇక ఒక రేషన్ కార్డు కింద ఒక కుటుంబాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకుంటున్నారు.. ఒక రేషన్ కార్డులో పేర్లున్న వారు రెండు మూడు కుటుంబాలుగా కూడా విడిపోయి బతుకుతున్నారు అని హరీశ్ రావు వెల్లడించారు. ఒకే ఇంట్లో వేర్వేరు పోర్షన్లలో వేర్వేరు అంతస్తుల్లో ఉంటున్నారు.. కానీ, ప్రభుత్వం వారందరినీ ఒకే కుటుంబంగా లెక్క కట్టి ఒక్కరికే పథకం వర్తింప చేస్తుంది అని హరీశ్ రావు అన్నారు. ఇది కూడా సరైన పద్ధతి కాదు.. ఎన్ని కుటుంబాలుంటే అన్ని కుటుంబాలకు ఈ పథకాన్ని వర్తింప చేయాలి.. నిజమైన పేదలకు న్యాయం చేయడమే మీ ప్రభుత్వ లక్ష్యమైతే.. మొత్తం 90 లక్షల పేద కుటుంబాలకు లబ్ది కలిగేలా చేయాలి.. అలా చేయని పక్షంలో ఈ పథకం కేవలం నామమాత్రంగానే మిగిలిపోతుందన్నారు. హామీల అమలుకు ప్రభుత్వమే తూట్లు పొడిచినట్లు అవుతుందనే విషయాన్ని మీ దృష్టికి తెస్తున్నాము.. నిజంగా పేదలకు సాయం చేయాలనే చిత్తశుద్ధి మీకుంటే.. వెంటనేపై మూడు విషయాల్లో తక్షణం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# రాష్ట్రాలను లూటీ చేస్తున్న కుటుంబ పార్టీలు

(మొదటి తరువాయి)



అత్యంత వేగంగా ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న దేశంగా భారత్ ఎదుగుతోందని అన్నారు. ఇప్పుడు మీకు మరో గ్యారెంటీ ఇస్తున్నా. కొన్నేండ్లలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్‌ను తీర్చిదిద్దుతా.. మీకు మాటిస్తున్నా. ఇది మోదీ గ్యారెంటీ.. మోదీ గ్యారెంటీ అంటే గ్యారెంటీగా పూర్తయ్యే గ్యారెంటీ. మోదీని తిట్టడమే కొందరు పనిగా పెట్టుకున్నారు. అలా ఎందుకు చేస్తున్నారంటే.. వారికి సంబంధించిన వేల కోట్ల అవినీతిని ప్రశ్నించినందుకు తిడుతున్నారు. నేను వ్యక్తిగతంగా ఎవరిపైనా విమర్శలు చేయలేదు.. కుటుంబ పాలనపై ప్రశ్నించినందుకు నన్ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. జమ్ము కశ్మీర్ నుంచి మొదలు తమిళనాడు వరకు కుటుంబ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కుటుంబాలు మాత్రమే బాగుపడ్డాయి.. రాష్ట్రం మాత్రం అధోగతి పాలైంది. కుటుంబ పాలనను మేము వ్యతిరేకిస్తున్నాం. అందుకే మాపై వారు విమర్శలు చేస్తున్నారు. నేను కుటుంబ పాలనపై ప్రశ్నిస్తుంటే.. వారు మాత్రం నాకు కుటుంబం లేదని నాపై విమర్శలు చేస్తున్నారు. కుటుంబ పాలన చేసే వారికి దొంగతనం చేసేందుకు లైసెన్స్ ఇచ్చారా? కబ్జా, అవినీతి చేసేందుకు లైసెన్స్ ఇచ్చారా? ఒక్కో కుటుంబంలో 50 మంది వరకు దోచుకుతింటున్నారు.. ఇది ప్రజాస్వామ్యమా.. మోదీపై మా యుద్ధం కొనసాగిస్తామని చెబుతున్నారు. మోదీకి కుటుంబం లేకపోతే కుటుంబ పార్టీలన్నీ యుద్ధానికి దిగుతాయా? కుటుంబ పార్టీలన్నీ తమ కుటుంబమే ఫస్ట్ అనుకుంటాయి.. కానీ మోదీకి మాత్రం నేషన్ ఫస్ట్. వారికి వారి కుటుంబమే ముఖ్యం.. కానీ నాకు దేశ ప్రజలంతా ముఖ్యం. కుటుంబ పార్టీలు నల్ల ధనాన్ని తెల్ల ధనంగా మార్చుకున్నాయి. కానీ నేను అలా కాకుండా నాకు వచ్చిన గిఫ్టులను దేశ అభివృద్ధి కోసం వేలం వేస్తున్నా.. గంగా మాత సేవ కోసం ఉపయోగిస్తున్నా. నేను మీ సేవకుడిని. నాకు కూడా కుటుంబం ఉంటే.. నాకు వచ్చిన గిఫ్టులను, వేలం ద్వారా వచ్చిన డబ్బులను నేను పట్టుకెళ్లేవాడినేమో.. కుటుంబ పార్టీలకు చెందిన కొందరు నేతలు విదేశీ బ్యాంకుల్లో ఖాతాలు ఓపెన్ చేశారు. వారు తమ కుటుంబం కోసం కోటలు కట్టించుకున్నారు. కానీ మోదీ ఇప్పటి వరకు తన కోసం ఒక్క ఇల్లును కూడా కట్టించుకోలేదు. కానీ ఇండ్లు లేని పేదల కోసం 4 లక్షల కోట్ల ఇండ్లను నిర్మించాడు. కుటుంబ పార్టీలు భూమి నుంచి ఆకాశం వరకు దేన్నీ వదలకుండా దోచుకున్నారు. కానీ మోదీ మాత్రం భుమి, ఆకాశం మాత్రమే కాకుండా పాతాళం వరకు ప్రతీ ఒక్క అవకాశాన్ని దేశాభివృద్ధి కోసమే చేస్తున్నారు. 140 కోట్ల మంది దేశ ప్రజలు మోదీ కుటుంబ సభ్యులే.. కాంగ్రెస్, ఇండియా కూటమి వాళ్లకు ఇంకా తెలియడం లేదు.. మోడీని దేశమంతా తమ కుటుంబ సభ్యులుగా భావిస్తున్నారు. తెలంగాణ ప్రజలంతా నేనే మోదీ కుటుంబమని చెబుతున్నారని ప్రధాని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు కిషన్ రెడ్డి, లక్ష్మణ్, బిబి పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల తరవాత విశాఖే రాజధాని

(మొదటి తరువాయి)



ప్రభుత్వం ఉందని అభివృద్ధితో కూడిన సంక్షేమాన్ని ప్రజలకు అందిస్తున్నామని వివరించారు. అదే టైంలో వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు వివరించారు. రాష్ట్రానికి విశాఖ చాలా ముఖ్యమైన బ్యాక్ బోన్‌గా ఉండబోతోందని అన్నారు. భవిష్యత్‌లో హైదరాబాద్ కంటే వైజాగ్ అభివద్ధి చెందుతుందని జగన్ అభిప్రాయపడ్డారు. విభజనలో భాగంగా హైదరాబాద్ కోల్పోయామని దాని ప్రభావం నేటికీ ఉంటోందన్నారు. ఓవైపు అభివృద్ధిని కొనసాగిస్తూనే ముఖ్యమైన వ్యవసాయ రంగాన్ని కూడా ఉరకలు పెట్టిస్తున్నామన్నారు. ప్రస్తుతం వ్యవసాయం ఏపీలో 70 శాతం వృద్ధిని నమోదు చేసిందన్నారు. చాలా రంగాల్లో దేశంలోని ఇతరరాష్ట్రాలతో పోలిస్తే ఏపీ మెరుగైన స్థానంలో ఉందన్నారు సీఎం జగన్. ఉత్పత్తి రంగంలో దేశంలోనే ఏపీ టాప్‌లో ఉందని వివరించారు. ఇలాంటి వాటన్నింటికీ పోర్టులు, ఇతర రవాణా సౌకర్యల తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే రామాయపట్నం, కాకినాడ, మూలపేట,మచిలీపట్నం, పోర్టులు రాష్ట్రాభివృద్ధికి సాయపడుతున్నాయని వివరించారు. ఈ క్రమంలోఎన్నికల తరువాత తాను విశాఖలో ఉంటానని సీఎం చెప్పారు. మళ్ళీ రెండవసారి ముఖ్యమంత్రిగా తాను విశాఖలోనే ప్రమాణస్వీకారం చేస్తానని స్పష్టం చేశారు. తాను విశాఖ వచ్చేందుకు అనేకసార్లు ప్రయత్నించిన రానివ్వలేదని తెలిపారు. కోర్ట్ కేసులు, కొన్ని మీడియా సంస్థలు విష ప్రచారం చేశాయన్నారు. భూ కబ్జాలు, అరాచకాలు అని ప్రచారం చేశారని మండిపడ్డారు. సీఎం వైజాగ్‌లో ఉంటే విశాఖ బాగా అభివృద్ధి చెందుతుందన్నారు. తాను ఒక్కడినే విశాఖను కార్యనిర్వహక రాజధానిగా చేయాలనుకున్నానని. ప్రతిపక్షం మొత్తం వ్యతిరేకించిందని తెలిపారు. అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనకు లక్ష కోట్లు అవుతుందని టీడీపీ ప్రభుత్వమే చెప్పిందంటూ జగన్ అన్నారు. అమరావతిలో ఎకరానికి మౌలిక సదుపాయాలకల్పనకు ఎకరాకు రూ.2 కోట్లు అవుతుందని డీపీఆర్ ఇచ్చారని సీఎం చెప్పారు. విశాఖలో రోడ్లు ఉన్నాయని... మంచి హోటల్స్ ఉన్నాయన్నారు. సెక్రటేరియట్ విశాఖలో అయితే ఐకానిక్ టవర్స్ కట్టవచ్చని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో నాలుగు పోర్ట్‌లు అతి వేగంతో నిర్మాణం జరుగుతున్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. తాను విశాఖ వచ్చేందుకు తెగ ప్రయత్నం చేశానని విశాఖ వాసులను జగన్ నమ్మించే యత్నాలు చేశారు. నాలుగుసార్లు ముహూర్తం పెట్టీ మరీ సీఎం వాయిదా వేసుకున్నారు. సీఎం వస్తే అందరూ వైజాగ్ వస్తారని... అప్పుడు దానంతట అదే అభివృద్ధి చెందుతుందంటూ ముఖ్యమంత్రి జగన్ చెప్పారు. వైజాగ్ రాడిసన్ బ్లూ హోటల్ లో విజన్ విశాఖ సదస్సులో సీఎం పాల్గొనగా.. 2,000 మందికి పైగా పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. విశాఖ అభివృద్ధి బాగా చెందుతోందని.. హైదరాబాద్ కంటే మిన్నగా వైజాగ్ అభివృద్ధి చెందుతుందన్నారు. దేశంలోనే వ్యవసాయ రంగంలో ఏపీలో 70 శాతం వృద్ధి సాధించిందని.. ఉత్పత్తి రంగంలో దేశంలోనే ఏపీ మెరుగ్గా ఉందన్నారు. అభివృద్ధిలో విశాఖ నగరం దూసుకెళ్తోందని.. అలాగే రామాయపట్నం, కాకినాడ, మూలపేట, మచిలీపట్నం పోర్టులు కీలకంగా మారాయన్నారు. గత ఐదేళ్లలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని.. ఏపీలో తలసరి ఆదాయం పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు హైదరాబాద్‌కే పరిమితమయ్యాయన్నారు. ప్రతి సంక్షేమ పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నామని. డీబీటీ పద్ధతి ద్వారా నేరుగా లబ్దిదారులకు నగదును అందజేస్తున్నామన్నారు. ఏపీలో మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని.. సముద్ర తీరంలో పోర్టులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఏపీలో నిరుద్యోగం తగ్గింది.. ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలతో 30 లక్షల ఉద్యోగాలు వచ్చాయని.. స్వయం ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయన్నారు. స్వయం సహాయక బృందాల పెండింగ్ రుణాలను మాఫీ చేశామన్నారు. బెంగళూరు కంటే వైజాగ్‌లో సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయని.. కొన్ని మీడియా సంస్థలు ప్రభుత్వంపై బురద జల్లుతున్నాయన్నారు. ప్రతిపక్షానికి లబ్ది కలిగించేలా కథనాలు ఇస్తున్నాయని.. నాయకుడి ఆలోచన తప్పుగా ఉంటే అభివృద్ధి చెందదన్నారు. స్వార్థ ప్రయోజనాల వల్ల విశాఖ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయి.. విశాఖ ఇంకా చాలా అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. అమరావతి రాజధానికి తాము వ్యతిరేకం కాదని.. అమరావతి శాసన రాజధానిగా కొనసాగుతోందన్నారు. అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనకు లక్ష కోట్లు కావాలని.. విశాఖ నగరాన్ని అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. విశాఖ స్టేడియాన్ని మెరుగ్గా నిర్మిస్తామన్నారు. ఎన్నికల తర్వాతే విశాఖలోనే ఉంటానని.. నగరంలో దేశాన్ని ఆకర్షించే ఐకానిక్ సెక్రటేరియట్ నిర్మిస్తామన్నారు. విశాఖను ఎకనామిక్ గ్రోత్ ఇంజిన్‌లా మారుస్తామన్నారు.. విశాఖ విషయంలో తనకు ఉన్న కమిట్మెంట్ ఇది అన్నారు. విశాఖ రాబోయే రోజుల్లో విశ్వనగరంగా మారుతుందని.. పరిపాలనా రాజధానికి కావాల్సిన అన్ని హంగులు విశాఖకు ఉన్నాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి వైజాగ్‌లో ఉంటే విశాఖ బాగా అభివృద్ధి చెందుతుందన్నారు.

# నేటికీ మంచి నీటికి నోచుకోని పదిలక్షల ఆవాసాలు

(మొదటి తరువాయి)



ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని అనుమతులు ఇస్తామని తెలిపారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ అభివృద్ధికి, మూసీ ప్రక్షాళన రివర్ ఫ్రంట్ అభివృద్ధికి సహకరించండి. తుమ్మిడిహెట్టి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. భూసేకరణ, నీటి వాటాల విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు ప్రధాని జోక్యం చేసుకోవాలి. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై అమ్రాబాద్ ఫారెస్ట్ ఏరియా మీదుగా ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణానికి సహకరించాలి. 2022-23లోనే కేంద్ర ప్రభుత్వం డీపీఆర్ తయారీకి రూ,3 కోట్లు మంజూరు చేసింది. రూ.7700 కోట్ల అంచనా ఖర్చయ్యే ఈ ప్రాజెక్టును మంజూరు చేయాలి. ఈ కారిడార్ తో అటు శ్రీశైలం వెళ్లే యాత్రికులతో పాటు హైదరాబాద్ నుంచి ఏపీలోని ప్రకాశం జిల్లా వరకు 45 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. దక్షిణ తెలంగాణ వైపు రవాణ మార్గాలు విస్తరిస్తాయని సిఎం తన లేఖలో పేర్కొన్నారు. ఇకపోతే హైదరాబాద్- రామగుండం, హైదరాబాద్-నాగ్పూర్ రహదారిపై రక్షణ శాఖ భూముల మీదుగా ఎలివేటేడ్ కారిడార్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు. వీటితో పాటు కారిడార్ల నిర్మాణానికి కంటోన్మెంట్ ఏరియాలో 178 ఎకరాలు, 10 టీఎంసీల కేశవపురం రిజర్వాయర్ నిర్మాణానికి పొన్నాల గ్రామ సమీపంలోని 1350 ఎకరాల మిలిటరీ డెయిరీ ఫామ్ ల్యాండ్స్ రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరారు. లీజు గడువు ముగిసిన శామీర్ పేటలో ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ 1038 ఎకరాల భూములను తిరిగి అప్పగించాలన్నారు. ఐఐటీ, నల్సార్, సెంట్రల్ యూనివర్సిటీ తో పాటు ఎన్నో పేరొందిన పరిశోధన, ఉన్నత విద్యా సంస్థలు హైదరాబాద్ లో ఉన్నాయి. అత్యున్నత విద్యా సంస్థలు అందరికీ అందుబాటులో ఉండాలని ప్రతి రాష్ట్రంలో ఒక ఐఐఎం నెలకొల్పాలనేది కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. అందులో భాగంగా హైదరాబాద్ లో ఐఐఎం నెలకొల్పాలన్నారు. అందుకు అవసరమైనంత స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తుందని అన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమం రాష్ట్రంలో విజయవంతంగా అమలు చేస్తున్నాం. 5259 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర వాటాగా రాష్ట్రానికి రావాల్సిన రూ.347.54 కోట్లను వెంటనే విడుదల చేయాలి. భారత్ మాల పరియోజన జాతీయ రహదారుల అభివృద్ధిలో భాగంగా తెలంగాణకు ప్రయోజనంగా ఉండే ఎనిమిది ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి. కల్వకుర్తి-కొల్లాపూర్, గౌరెల్లి-వలిగొండ, తొర్రూర్-నెహ్రూనగర్, నెహ్రూనగర్-కొత్తగూడెం, జగిత్యాల-కరీంగర్ ఫోర్ లేన్, జడ్చర్ల-మరికల్ ఫోర్ లేన్, మరికల్-డియసాగర్ నిలిచిపోయిన టెండర్ల పక్రియకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలన్నారు. తెలంగాణలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం సహకారాన్ని కోరుతున్నాం. ఇప్పటికే ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ లో ప్రధాన పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. సెమీ కండక్లర్లు, డిస్ ప్లే మ్యానుఫ్యాక్షరింగ్ రంగంలో కొత్త శకానికి నాంది పలికేందుకు ఇండియా సెమీ కండకర్ల మిషన్లో భాగంగా కేంద్రం సాయం అందించాలని సిఎం రేవంత్ తన వినతిలో పేర్కొన్నారు.

# అల్ఫోర్స్ పాఠశాలలో

# “అంగరంగ వైభవంగా వార్షికోత్సవ వేడుకలు”

-ఖుషీ ఆవిష్కరించిన అల్ఫోర్స్ ఫ్యాంటసీ...
-అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు....
-విద్యార్థుల కేరింతలతో మార్మోగిన ఆల్పోర్ట్స్ పాఠశాల ప్రాంగణం...
-జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన...
-అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి నరేందర్ రెడ్డి...







తరంగాలు/వర్ధన్నపేట: ప్రతి విద్యార్థికి సాంస్కృతిక కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని,వాటి పట్ల ఆసక్తి కనబరిచే విధంగా ప్రోత్సాహకాలను అందించాలని తద్వారా వారు అందులో పట్టు సాధిస్తారని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి నరేందర్ రెడ్డి అన్నారు.అల్ఫోర్స్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు . ఈ సందర్భంగా ముఖ్య అతిథులతో కలసి స్థానిక పాఠశాల ప్రాంగణంలో “ఫ్యాంటసీ” పేరుతో నిర్వహించినటువంటి పాఠశాల వార్షికోత్సవ వేడుకలను సాంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలన చేశారు.అనంతరం చదువుల తల్లి జ్ఞానసరస్వతి మాత విగ్రహానికి పూలమాల వేసి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి నరేందర్ రెడ్డి విద్యార్థుల ఆనందోత్సవాల మధ్య కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు కళల వైభవాన్ని విశ్లేషించి చెప్పాలని తద్వారా వారికి కళల పట్ల ఆసక్తి పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహన ఉండాలని అన్నారు.అందులో పాల్గొనడానికై ఎంతగానో ఆసక్తి తో ఉండాలని తెలుపుతూ వాటిపట్ల దృష్టి సారింపచేయాలని కోరారు. మన దేశచరిత్ర విభిన్న కళలకు విశిష్టమైనదని గుర్తుచేస్తూ మనదేశంలో ఉన్నటువంటి కళలు సాంప్రదాయాలు మరేదేశంలో అవలంబించరని చెప్పారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో డా.వి. నరేందర్ రెడ్డి సారథ్యంలో విద్యార్థులకు వివిధ కళా నైపుణ్య కార్యక్రమాలను దశల వారిగా నిర్వహించడం చాలా అభినందనీయమని మరియు ప్రోత్సాహకాలను అందించడం చాలా ఆదర్శనీయమని కొనియాడారు. విద్యార్థులకు వారాంతపు వినోద కార్యక్రమాలను సైతం నిర్వహిస్తూ వారిలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీయడంలో ప్రధాన పాత్ర పోషిస్తూన్నదని హర్షం వ్యక్తం చేసారు.డా.వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో ప్రణాళికబద్ధంగా విద్యార్థుల్లో దాగి ఉన్నటువంటి ప్రతిభను సృజనాత్మకతను వెలికితీయడానికై తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు కృషి చేయడం చాలా గొప్ప విషయమని అన్నారు. వారికి కావలసినటువంటి వనరులను కల్పించి అద్భుతాలు చేస్తూన్నారని తెలిపారు. నూతన ఎన్నికైన శాసనసభ్యున్ని చాలా ఘనంగా సన్మానించారు. అదే విధంగా వర్ధన్నపేట అభివృద్ధికి చేయూతనిస్తూందని ప్రకటించారు మరియు జిల్లాకు తలమానికంగా నిలుస్తూందని చెప్పారు.వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి “చిన్ని చిన్ని ఆశ....”, “ఛలో... ఛలో వచ్చిందమ్మా...ఆనందం తెచ్చిందమ్మ”, “స్నేహితుడా... ఓ స్నేహితుడా”, “ఓయ్ బాటసారి.. చూద్దామా మన వేడుకలను చాలా ఆకర్షించాయి. విద్యార్థులు చేపట్టినటువంటి నవ్వుతో జబరస్త్ కార్యక్రమం కడుపారా నవ్వింపజేసింది. వార్షిక ప్రణాళికలో భాగంగా వివిధ పోటీపరీక్షల్లో అద్భుత ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, మున్సిపల్ ఛైర్ పర్సన్ ఆంగోతు అరుణ, బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు తూల్ల కుమారస్వామి, వార్డ్ కౌన్సిలర్లు మంచాల రామకృష్ణ, తుమ్మల రవీందర్,పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

**ఇట్లు డా వి. నరేందర్ రెడ్డి ఛైర్మెన్**





## కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ అధికార ప్రతినిధి గా నిమ్మని శేఖర్ రావు



వర్ధన్నపేట-తరంగాలు
వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గా ప్రముఖ అడ్వకేట్ నిమ్మని శేఖర్ రావు ని నియమించిన ంవర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు ఈ నందర్భంగా అడ్వకేట్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీకి అందించిన సేవలకు గాను వర్ధన్నపేట ఎమ్మెల్యే నన్ను గుర్తించి, ఈ పదవి ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని, ఇంకా పార్టీకి మరింత సేవా చేసుకునే బాధ్యత పెరిగిందని, పార్టీని నాదీుగ్న వంతుగా మరింత బలోపేతం చేస్తానని అన్నారు. ఈ పదవి రావడానికి సహకరించిన పార్టీ పెద్దలకు నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు

## సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఈసీ సిద్ధం

(మొదటి తరువాయి)

**వివిధ** రాష్ట్రాల్లో పర్యటన కొనసాగుతుంది. ఇప్పటికే తెలంగాణ నుంచి ఈ టూర్ కు శ్రీకారం చుట్టారు. మార్చి 4న తెలంగాణ, తమిళనాడులో పర్యటించారు. మార్చి 5న తెలంగాణలోనే పర్యటన చేస్తున్నారు. ఆ తర్వాత మరో 10 రాష్ట్రాలు , కేంద్ర పాలిత ప్రాంతాలకు వెళ్లనున్నారు. వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. అలాగే పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. ప్రధాని మోదీ రాష్ట్రాల పర్యటన మార్చి 12తో ముగుస్తుంది. ఆ తర్వాత రోజే సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందని వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే బీజేపీ తన అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది

## రాష్ట్రంలో పోలీసుల అకృత్యాలు పెరిగిపోయాయి

- ఎంపీ రఘురామ తీవ్ర ఆగ్రహం



తరంగాలు/ఢిల్లీ: ఏపీలో15వ తేదీ లోపు ఎన్నికల షెడ్యూల్ రాబోతుందని.. తన దగ్గర సమాచారం ఉందని ఎంపీ రఘురామ కృష్ణంరాజు అన్నారు. ప్రజలు ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వస్తుందోనని ఎదురు చూస్తున్నారని చెప్పారు. మంగళవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.... రాష్ట్రంలో పోలీసుల అకృత్యాలు పెరిగిపోయాయని.. పోలీసుల దాడులను ప్రజలు తట్టుకోలేని పరిస్థితి రాష్ట్రంలో ఉందని చెప్పారు. సీఎం జగన్మోహన్ రెడ్డి, వైసీపీ నేతలు తిరుమల రెడ్డి, సజ్జల రామకృష్ణ రెడ్డి ఆదేశాలతో ప్రతిపక్ష నేతల ఇళ్లపై పోలీసులు చాలా దాడులు చేశారని అన్నారు. పోలీసులు ప్రజలకు రక్షణగా ఉండాలే కానీ వైసీపీ నేతలకు కొమ్ముకాసేలా ఉండకూడదని చెప్పారు. వారు ఎవరికైతే మద్దతుగా ఉంటున్నారో ఆ నేతలు రాబోయే ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోతారని హెచ్చరించారు. విశాఖపట్నంలో ఓ కారు మీద జగన్ ఫొటో వేసుకొని ఓటు వేయాలని ఓ పార్టీకి సీఐ ఎలా ప్రచారం చేశారని నిలదీశారు. పోలీసులు భక్షక భటులుగా మారి ప్రజలను భయాభ్రాంతులకు గురిచేస్తున్నారని విరుచుకుపడ్డారు. ఏపీలో త్వరగా ఎన్నికల కోడ్ వస్తే బాగుంటుందని ప్రజలు అనుకుంటున్నారని చెప్పారు.

## బిఆర్ఎస్‌కు వరుస దెబ్బలు

(మొదటి తరువాయి)

బీజేపీ కండువా కప్పేసుకున్నారు. ఇద్దరు సిట్టింగ్ ఎంపీలు పోతుగంటి రాములు, జహీరబాద్ ఎంపీ బీబీ పాటిల్... పార్టీకి రాంరాం చెప్పేశారు. వారిద్దరూ బీజేపీ కండువా కప్పుకోవడం జరిగిపోయింది. బీబీ పాటిల్‌కు జహీరాబాద్ పార్లమెంట్ స్థానం, ఎంపీ రాములు తనయుడు భరత్‌కు నాగర్‌కర్నూలు ఎంపీ సీటు కేటాయించింది. వీరిద్దరు మొదటి జాబితాలోనే టికెట్ దక్కించుకున్నారు. మరికొందరు నేతలు కాషాయ పార్టీ తీర్థం పుచ్చుకునేందుకు రెడీ ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. వర్ధనపేటకు చెందిన ఆరూరి రమేశ్, వరంగల్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి కూడా కారు వీడేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే పట్నం మహేందర్ రెడ్డి దంపతులు, తీగల కృష్ణారెడ్డిలు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. బద్రాచలం ఎమ్మెల్యే కూడా కారు దిగేందుకు రెడీ అయ్యారు. ఈ క్రమంలో ఒక్కొక్కరుగా జారు కుంటున్నట్లు తెలుస్తోంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో భారత రాష్ట్ర సమితి పార్టీ ఓటమి పాలయింది. మూడోసారి అధికారంలోకి వస్తామని భావించిన గులాబీ పార్టీ అంచనాలు తలకిందులు అయ్యాయి. మళ్ళీ అధికారంలోకి రావడం ఖాయమంటూ కొందరు నేతలు లెక్కలు వేసుకున్నారు. కేసీఆర్ కూడా మూడోసారి గెలుస్తామని చెప్పడంతో...ఇతర పార్టీల నుంచి పలువురు నేతలు ముందుకు వెనుక ఆలోచించకుండా కారు ఎక్కేశారు. గులాబీ పార్టీ ఓవర్ లోడ్ అని తెలిసినా...అధికారంలోకి వస్తే పదవులు వస్తాయన్న ఆశతో కండువా కప్పేసుకున్నారు. ఎన్నికల్లో కాంగ్రెసు పార్టీ అధికారంలోకి రావడంతో...రాజకీయ పరిణామాలు చకచకా మారిపోతున్నాయి. పార్టీ అధికారంలో ఉన్న ఎమ్మెల్యే, ఎంపీ పదవులు అనుభవించిన నేతలు... ఒక్కొక్కరుగా మెల్లిగా కారు పార్టీకి గుడ్ చెప్పేస్తున్నారు. ఇటు కేంద్రం...అటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలలోకి నేతలు జంప్ అవుతున్నారు. ఇద్దరు ఎంపీలు బీజేపీలో చేరడం...అంతకుముందు పలువురు ఎమ్మెల్యే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం కావడంతో కారు పార్టీలో కలవరం మొదలైనట్లు తెలుస్తోంది. ఇక ముందు కూడా వలసలు ఇలాగే కొనసాగుతాయా అన్న చర్చ బీఆర్ఎస్ పార్టీలో మొదలైంది. పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసే వరకు...వలసలు ఏ స్థాయికి చేరుకుంటాయన్నది చర్చనీయాంశంగా మారింది. తాజాగా పలువురు ఎమ్మెల్యేలు కూడా ఇతర పార్టీల్లోకి వెళ్తారన్న ప్రచారం జోరుగా జరుగుతోంది. అధికారంలో ఉన్నప్పుడు పదవులు ఎంజాయ్ చేసిన నేతలు...గులాబీ పార్టీకి గుడ్ బై చెబుతున్నారు. అయితే ఎంత మంది నేతలు వెళ్తున్నా...బీఆర్ఎస్ హైకమాండ్ పెద్దగా స్పందించడం లేదు. దీనికి కారణాలు ఉన్నాయని సొంత పార్టీ నేతలు చెబుతున్నారు. పార్టీ వీడే నేతలను బుజ్జగించాల్సిన అవసరం లేదని, అధికారం లేనప్పుడు పార్టీలో కొనసాగే ఆలోచన లేని నేతలు...బయటకు పోతే మంచిదని యోచనలో హైకమాండ్ ఉంది. అధికార కాంగ్రెస్ కూడా బిఆర్ఎస్‌ను ఖాళీ చేయించే పనిలో ఉంది. బిఆర్ఎస్‌ను దెబ్బతీసే పనిలో బిజెపి కూడా ఉంది.

## మనలో ఒకడు మన మల్లన్న





తరంగాలు/వరంగల్ జిల్లా ప్రతినిధి:
మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ సిఐ పి మల్లయ్య తన చేతలతో వైవిధ్యం చూపిస్తున్నారు. గత నెల 8 వ తేదీన సిఐ గా ఛార్జ్ తీసుకున్న కొద్ది రోజులలోనే తన మార్కు చూపిస్తున్నారు. సమస్యలతో పోలీస్ స్టేషన్ కు వచ్చిన బాధితుల సమయాన్ని వృధా చేయకుండా వెంట వెంటనే వారి సమస్యలను పరిష్కరిస్తూ వారికి మనోధైర్యాన్ని కల్పిస్తున్నారు. ఒకప్పుడు పోలీస్ స్టేషన్ వద్ద ఎప్పుడు చూసినా జనం ఉండేవారు కానీ మల్లయ్య వచ్చినప్పటి నుంచి ప్రజలను ఎక్కువసార్లు తిప్పించుకోకుండా వెంట వెంటనే సమస్యలను పరిష్కరిస్తూ స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజల మన్ననలు పొందుతుండడం గమనార్హం. ఫ్రెండ్లీ పోలీసింగ్ మారుపేరుగా మారుతూ అదే విధంగా నేరం చేసిన వారి పట్ల కఠినంగా వ్యవహరించడం పలువురుని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. మంచి వాళ్లకు మంచి వానిగాను చెడ్డ వాళ్లకు చెడ్డవాడు గాను ఉంటూ నిరంతరం పోలీస్ స్టేషన్ లోనే ఉండి ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని ప్రజలు అనుకుంటున్నారు. అంతేకాకుండా సమాజం పట్ల""" ఓ యువత మేలుకో నీ శక్తిని నువ్వు తెలుసుకో"""కార్యక్రమంలో చాలా చక్కగా మాట్లాడి యువతకు ఆదర్శంగా ఉంటున్నారని కూడా యువకులు అనుకుంటున్నారు. తాను రాకముందు వచ్చిన తర్వాత పలు రకాల చెట్లను పెట్టి తన క్యాబిన్లో కూడా చెట్లను ఉంచి పచ్చడి వాతావరణం కల్పించడం కొసమెరుపు. పోలియో చుక్కల రోజున పిల్లలకు పోలియో చుక్కలు వేసి పోలీసులు అన్ని రకాలుగా అన్ని అంశాలలో సహాయకారిగా ఉంటూ ప్రజల యొక్క క్షేమం కోసం పనిచేస్తారని నిరూపించారు. అంతేకాకుండా స్టేషన్లో ఉన్న ఎస్ఐలు కూడా బాధితుల నుంచి ఫిర్యాదులు సేకరించి వెంట వెంటనే చర్యలు తీసుకోవడం శుభసూచకమని మిస్ కాలని పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## నూతన హాస్పిటల్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి



తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం రూరల్:
వైద్యులు అందుబాటులో ఉండి, రోగులకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర రెవిన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి, ఖమ్మం రూరల్ మండలంలోని తెల్దారుపల్లి లో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాధమిక ఆరోగ్య ఉపకేంద్ర నూతన భవనానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం విద్య, వైద్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. పేదవారికి మంచి వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. పేదవానికి భరోసా ఇవ్వాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని, ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగించాలని అన్నారు. అర్ధరాత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు ఉంటారని, వైద్యం అందుతుందనే భరోసా ప్రజలకు ఇవ్వాలని అన్నారు. ప్రజల అభీష్టం మేరకు ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. అభయహస్తం క్రింద ఇచ్చిన 6 గ్యారంటీల్లో ఇప్పటికే 4 గ్యారంటీలు ప్రజల గుమ్మంకు చేర్చామన్నారు. ఈ నెల 11న భద్రాచలం శ్రీరాముల వారి సన్నిధిలో 5వ గ్యారంటీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వబోతున్నట్లు ఆయన తెలిపారు. ఇచ్చిన ప్రతి మాటను తూ.చ. తప్పకుండా ప్రజలకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఎస్ఇ చంద్రమౌళి, ఎస్డీపివో నీలోహన, ఖమ్మం రూరల్ ఎంపిపి బెల్లం ఉమ, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల గోడ పత్రికను ఆవిష్కరించిన ఎంపీపీ



తరంగాలు/ సంగెం
సంగెం మండలం సంఘమేశ్వర ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల గోడ పత్రికను ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఎంపీపీ కందగట్ల కళావతి ఆవిష్కరించినారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ కందగట్ల నరహరి మాట్లాడుతూ సంగెం మండల కేంద్రంలోని సంఘమేశ్వర ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను ఈనెల మార్చి 5 నుండి 8 తారీకు వరకు ఘనంగా నిర్వహిస్తున్నామని, మార్చి 8 తారీకు మహాశివరాత్రి రోజున రాత్రి 1:03నిమిషాలకు శివపార్వతుల కళ్యాణం జరుగుతుంది. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహా శివుని కృప, ఆశీస్సులు పొందాలి అని, ఆలయ ప్రాంగణంలో రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని వాటికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లయ్య, కమిటీ ప్రధాన కార్యదర్శి అగపాటి రాజు, ఉపాధ్యక్షులు మునుకుంట్ల కోటేశ్వర్, కక్కర్ల శరత్ , గుండేటి రాజకుమార్ ,కమిటీ సభ్యులు గుండేటి బాబు, మెట్టిపల్లి రమేష్, కోడూరి సదయ్య, పులి వీరస్వామి, పులి సాంబయ్య, అప్పే నాగార్జున శర్మ, నల్లతీగల రవి, అప్పాల కవిత, గుండేటి లవకుమార్, ఇప్పకాయల మనోహర్, పేరాల లక్ష్మీనర్సయ్య, మెట్టిపల్లి ఏలియా,గుండేటి చిన్ని, గుండేటి సునీల్, మెట్టిపల్లి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక వర్గ పోరాటాలే మతోన్మాద దోపిడి పాలకులకు ప్రత్యామ్నాయం

-మనువాద బిజెపి మోడీ పాలనకు చరమగీతం
-ఎంసిపిఐ(యు) ఆధ్వర్యంలో భారీ ప్రజా ప్రదర్శన
-ఎర్రజెండాలతో ఎరుపెక్కిన వరంగల్ పట్టణం




తరంగాలు/వరంగల్ జిల్లా ప్రతినిధి:
దేశ సంపదను కొల్లగొట్టి మతోన్మాద విధానాలతో ప్రజా సమస్యలను గాలికొదిలి పెట్టుబడుదారులకు దోచిపెడుతున్న బిజెపి మోడీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని సామాజిక వర్గ పోరాటాలను ఉధృతం చేయాలని ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ గాదగోని రవి పిలుపునిచ్చారు. మంగళవారం రోజు కమ్యూనిస్టు కోఆర్డినేషన్ కమిటీ (సిసిసి) పిలుపుమేరకు ఎంసిపిఐ(యు) ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోచం మైదాన్ సెంటర్ నుంచి రైల్వే స్టేషన్ వరకు భారీ ప్రజా ప్రదర్శన నిర్వహించారు. మతోన్మాద కార్పోరేట్ ప్రజా వ్యతిరేక విధానాలను నశించాలి ప్రజాస్వామ్యం పరిరక్షించాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన గాదగోని రవి మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం అయినా భారత ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేసే విధంగా మనువాద నియంతృత్వ విధానాలకు పాల్పడుతూ మోడీ ప్రభుత్వం రైతుల కార్మికుల ప్రజల హక్కులను కాలరాస్తున్నదని గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించి అప్రజాస్వామిక పద్ధతుల్లో పాలన కొనసాగిస్తూ వ్యక్తిగత స్వేచ్ఛని హరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని సంకల్పంతో మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజల ఐక్యతను చీల్చాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని భారతదేశ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే బిజెపి మోడీ పాలనకు ముగింపు పలకాలని అవినీతి అవకాశవాద రాజకీయ పార్టీలను సైతం ఓడించాలని ఆ దిశలో అన్ని వర్గాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ హనుమకొండ జిల్లా కార్యదర్శులు పెద్దారపు రమేష్ ఎన్ రెడ్డి హంసారెడ్డి రాష్ట్ర కమిటీ సభ్యుల మంద రవి గుండెబోయిన చంద్రయ్య నాగెల్లి కొమురయ్య గడ్డం నాగార్జున నర్ర ప్రతాప్ కుసుంబ బాబూరావు వంగల రాగసుధ కనకం సంధ్య మాస్ సావిత్రి కంచ వెంకన్న కన్నం వెంకన్న జిల్లా కమిటీ సభ్యులు కందికొండ కుమారస్వామి కొత్తకొండ రాజమౌళి ఎండి ఇస్మాయిల్ గుగులోతు అరుణ్ ఎల్లబోయిన రాజు ఎగ్గని మల్లికార్జున్ ఐతం నాగేష్ అప్పనపూర్ నర్సయ్య ఎండి ఉస్మాన్ మంద భద్రయ్య జూలూరి ఇందు తదితరులు పాల్గొన్నారు.



# వేసవికాలంలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

-వ్యవసాయ శాఖ మంత్రి, తుమ్మల
కలెక్టర్ వి పి గౌతం



తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం,
వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ముందస్తు ప్రణాళికతో సంసిద్ధంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్‌తో కలిసి జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు చేపట్టవలసిన ముందస్తు చర్యలపై రెవెన్యూ, ఇర్రిగేషన్, పబ్లిక్ హెల్త్, మిషన్ భగీరథ, పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో నీటి వనరుల లభ్యత వినియోగంపై సంబంధిత శాఖల సమన్వయంతో పటిష్ట ప్రణాళికతో పర్యవేక్షణ చేయాలన్నారు. పాలేరు, వైరా, లకారం,లంకపల్లి జలాశాయాలలో లభ్యత, వచ్చే నాలుగు నెలలకు సరిపడా కావాల్సిన నీటి లభ్యతకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. బేతుపల్లి, బోడేపూడి సుజలాంసఫలం, భగీరథ ఎన్ఎస్‌పి ద్వారా నీటిని సమకూర్చుకుంటే భూగర్భ జలాలు పెరగడంతో పాటు బోర్లు, బావుల్లో గ్రావిటీ పెరుగుతుందని తద్వారా వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా నీటి కొరతను అదిగమించవచ్చన్నారు. మిషన్ భగీరథతో పాటు ఇతర నీటి లభ్యతకు చర్యలు చేపట్టాలన్నారు. 50 శాతం గ్రౌండ్ వాటర్‌ను సమకూర్చుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ మాట్లాడుతూ గౌరవ మంత్రివర్యుల సూచనల ప్రకారం నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందని, తాగునీటి లభ్యత, వినియోగంపై సమీక్షా సమావేశాలు నిర్వహించి ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. దనావాయి గూడెంలో ఫిల్టర్ బెడ్స్‌తో పాటు లకారంలో 5 ఎంల్‌డి ఫిల్టర్ బెడ్స్ ద్వారా నగరంలో సరఫరా చేయడం జరుగుతుందన్నారు. మిషన్ భగీరథ ఇన్‌టేక్ వెల్ ద్వారా రోజువారి వినయోగంకు కావాల్సిన నీటి లభ్యతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందని, జలాశయాలతో పాటు గ్రామాలలో ఉన్న బోర్లను పునరుద్ధరించడం జరిగిందని, రోజువారి వినియోగంకు .013 టిఎంసీ అవసరమవుతుందని ఏప్రిల్ 1 నాటికి 1 టింఎసి నీటిని సమకూర్చుకున్నట్లయితే వచ్చే నాలుగు నెలల వరకు సప్లయి చేసేందుకు ఇబ్బందులుండవన్నారు. కార్పోరేషన్ పరిధిలో 33 ఎంఎల్‌డి సప్లయి చేసే వారమని, మరో 5 ఎంఎల్‌డి పెంచడం జరిగిందని, ఇప్పటి వరకు 4 మోటార్లు రన్నవుతున్నాయని మరో మోటారును కూడా సిద్ధం చేయడం జరిగిందని 5 మోటార్ల ద్వారా నీటి సరఫరాకు ఏర్పాట్లు చేయడం జరిగిందని ఇర్రిగేషన్ శాఖ అధికారులు వివరించారు. పోలీసు కమీషనర్ సునీల్ దత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, శిక్షణ కలెక్టర్‌లు మయాంక్‌సింగ్, యువరాజ్, ట్రాన్స్‌కో ఎస్.ఈ సురేందర్, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ ఆనంద్‌కుమార్ మిషన్ ఎస్.సదాశివకుమార్, భగీరథ ఇంట్రా ఇ.ఇ పుష్పలత, గ్రిడ్ ఇఇ వాణిశ్రీ, పబ్లిక్ హెల్త్ ఇ.ఇ రంజిత్‌కుమార్, మున్సిపల్ ఇ.ఇ కృష్ణలాల్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## నరసింహుల పేట పోలీస్ స్టేషన్ ను సందర్శించిన డి.ఎస్.పి, సీఐ



తరంగాలు నరసింహుల పేట
మంగళవారం నరసింహుల పేట పోలీస్ స్టేషన్ ను సందర్శించిన తొర్రూర్ డి.ఎస్.పి, వి సురేష్ మరియు సీఐ టి సంజీవ్ పాల్గొనడం జరిగిందని స్థానిక ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపారు. అలాగే స్థానిక పోలీస్ స్టేషన్లో మొక్కలు నాటి అనంతరం పలు రికార్డులను పరిశీలించడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నందున పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి 26 పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం జరిగిందని అలాగే సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా తీసుకోవాల్సిన చర్యల పట్ల పలు సూచనలు చేయడం జరిగిందని స్థానిక ఎస్సై తెలిపారు.



## ఇంటింటి పోలియో సర్వే పై జిల్లా ఇమ్యూనిజషన్ అధికారి ఆకస్మిక తనిఖీ

-: డాక్టర్ దుర్గా భవాని



పినపాక/తరంగాలు
పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా 3వ రోజు మరియు చివరి రోజు జిల్లా ఇమ్యూనిజషన్ ఆఫీసర్ ఆధ్వర్యంలో పినపాక ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దుర్గ భవాని తో కలిసి సీతంపేట గ్రామం లో ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిలో భాగంగా మొదటి రోజు మండలంలోని అన్ని గ్రామాలలో పోలియో చుక్కలు వేయించుకోని పిల్లలకు, ఇతర మండలాలను%శీ%డి వచ్చిన వారికి కూడా అందించనున్నట్లు తెలిపారు. మొదటి రోజు మార్చి 3 న జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా 98 శాతం మంది పిల్లలకు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాగభూషణం, హెచ్ ఇ ఓ వీరస్వామి , హెల్త్ అసిస్టెంట్ వెంకట్, ఏఎన్ఎం శ్రీకళ,వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తరంగాలు

# నూతన డి.ఎస్.పి, సిఐలను కలిసిన పినపాక నియోజకవర్గం ప్రెస్ క్లబ్ సభ్యులు



పినపాక/తరంగాలు

నూతనంగా మణుగూరు డిఎస్పీగా బాధ్యతలు చేపట్టిన డి.ఎస్.పి రవీందర్ రెడ్డి, సిఐ సతీష్ కుమార్ లను మణుగూరు, పినపాక నియోజకవర్గం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బోగా ఓదెలు, ప్రధాన కార్యదర్శి కనుక రమేష్, గౌరవ అధ్యక్షుడు గుండు నరసింహమూర్తి ఆధ్వర్యంలో అధికారులకు పుష్పగుచ్ఛాలు మంగళవారం అందజేశారు. నూతన అధికారులతో స్థానిక స్థితిగతులపై వివరించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ.. స్థానిక స్థితిగతులపై అవగాహన కోసం అందరితో సంప్రదించి ప్రజలందరికీ న్యాయం జరగడం కోసం పోరాడుదాం అన్నారు. సమస్యలు వస్తే నేరుగా పోలీసులను సంప్రదించాలన్నారు. ముఖ్యంగా మణుగూరు సబ్ డివిజన్ లో యువత చెడు మార్గంలో నడుస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు రమేష్, నరసింహారావు, వెంకట్ రెడ్డి, గోపి, కృష్ణ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదు

### -జిల్లా కలెక్టర్ వి పి గౌతమ్

తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం,

వైరా మండలం తీర్థాల, స్నానాల లక్ష్మీపురం, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ తీర్థాల సంగమేశ్వర స్వామి దేవాలయం, స్నానాల లక్ష్మీపురం జాతర ఏర్పాట్లపై దేవాదయా, రెవెన్యూ, విద్యుత్, ఇర్రిగేషన్, పంచాయితీ, ఆర్.టి.సి, మత్స్యశాఖ, ఫైర్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మార్చి 8 నుండి జరిగే తీర్థాల, స్నానాల లక్ష్మీపురం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. దర్శనం క్యూలైన్లు, లైటింగ్, పారిశుద్ధ్య పరంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.గ్రామ శివారులో పార్కింగ్,మిషన్ భగీరథ ద్వారా సురక్షిత త్రాగునీరు అందించాలన్నారు.స్నాన ఘట్టాలు ఏర్పాటు చేయాలన్నారు.పబ్లిక్ అడ్రస్ సిస్టం,భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమీక్ష



లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, ఎస్ఈ ట్రాన్స్కో సురేందర్, సీ.ఈ.ఓ జడ్పీ వినోద్,మిషన్ భగీరథ ఇఇలు పుష్పలత, వాణిశ్రీ, మత్స్య శాఖ ఏడి ఆంజనేయ స్వామి, దేవాదాయ అసిస్టెంట్ కమీషనర్ సులోచన, ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాటిచ్చారు తీవ్ర సమస్య తీర్చారు

### -మంత్రి పొంగులేటి చొరవతో కైకొండాయిగూడెంలో డ్రెయినేజీ తిప్పలకు పరిష్కారం





తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం రూరల్ :

మంత్రి పొంగులేటి మాటిచ్చారంటే ఆ పని పూర్తవ్వాల్సిందే. అందుకు కైకొండాయిగూడెం ఘటన ఓ చిన్న ఉదాహరణ. రాష్ట్రరెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జనవరి 31వ తేదీన కైకొండాయిగూడెం (ఒకటో డివిజన్)లోని గణేష్ టౌన్షిప్ ప్రాంతాన్ని సందర్శించారు. ఆ ప్రాంతంలో కలియ తిరిగి.. స్థానికులతో ముచ్చటించగా.. గణేష్ టౌన్షిప్ ప్రాంతంలో మురుగు సమస్యను విన్నవించారు. దీంతో స్పందించి ఆయన సంబంధిత మున్సిపల్ అధికారులను ఆదేశించడంతో సత్వర చర్యలు చేపట్టారు. పొక్లెయిన్ ద్వారా కొత్తగా సైడ్ కాల్వ తవ్వించారు. పూడుకుపోయిన పాత డ్రేయినేజీలో మురుగు తొలగించే పనులు పూర్తి చేయించారు. దీంతో చాలా కాలంగా పెండింగ్లో ఉన్న ఈ సమస్యకు పరిష్కారం లభించిందని ఆ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గణేష్ టౌన్షిప్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, విహార అపార్ట్మెంట్ కార్యదర్శి గంగాధర్, స్థానికులు మంత్రి పొంగులేటికి తమ కృతజ్ఞతలు తెలిపారు.

# మిర్చి మార్కెట్లో మధ్య దళారీ దోపిడీని అరికట్టాలి

### -ఖమ్మం లో మంత్రి తుమ్మల క్యాంప్ కార్యాలయం ముట్టడి
### -సిపిఐ ఎం ఎల్(ఏం ఎల్) న్యూడెమోక్రసీ, అఖిలభారత రైతు కూలీ సంఘం(ఎ ఐ కేఎంఎస్) జిల్లా కమిటీల డిమాండ్

తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయాన్ని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ,అఖిల భారత రైతుకు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముట్టడించారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రైతుల పట్ల నిర్లక్ష్యం వహించిందని జిల్లాలో రైతులు తిరగబడితే బేడీలు వేసి జైలుకు పంపిన చరిత్ర గత ప్రభుత్వానికి ఉన్నదని అదే తరహాలో కొత్త ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వ్యతిరేక కార్యక్రమాల చేయవద్దని రైతులకు మద్దతు ధర కల్పించి స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని ఈ ప్రభుత్వాన్ని వారు కోరారు.అదేవిధంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి రాష్ట్ర కార్యదర్శి వర్గ నాయకులు అవునూరి మధు మాట్లాడుతూ అఖిల భారత స్థాయిలో రైతాంగ ఉద్యమాలు ఒకపక్క జరుగుతా ఉన్నాయి ఎంఎస్పీ చట్టం తేవాలని రైతాంగానికి మద్దతు ధర కనీసం చింతాకు 30వెలు రూపాయలు నిర్ణయించాలని వారు అన్నారు అఖిలభారత రైతుకులి సంఘం రాష్ట్ర నాయకులు డేవిడ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన ఉచిత వాగ్దానాలను అమలు చేయాలని రైతాంగానికి





రెండు లక్షల రుణమాఫీని తక్షణమే చేసి బ్యాంకుల ద్వారా కొత్త రుణాలను అందించాలని వారు అన్నారు సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఖమ్మం జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ జిల్లాల్లో రైతులు పండించిన పంటను ఖమ్మం మార్కెట్లోకి తీసుకొచ్చి అమ్ముకుంటున్నారు మార్కెట్లో ఉన్న వ్యాపారులు రైతులను నిలువునా దోపిడీ చేస్తూ మార్కెట్ మాయాజాలంతో రైతులు విలవిల కొట్టుకుంటున్నారు. కింటామిర్చికి జెండా పాట 22 వెలు పాడితే అలా కొనకుండా దాన్ని 14 నుండి 16 వేల రూపాయలకు ఖరీదు చేస్తున్నారని రైతులు అడిగితే వారి అతి తెలివిని చూపి రైతులను అనేక రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారని నియమ నిబంధనలు లేకుండా ఈ ప్రభుత్వాలు రైతులతో చెలగాటం ఆడుతున్నారు అని వారు అన్నారు.ఖమ్మం మార్కెట్లో జరుగుతున్న మధ్య దళారుల రూపంలో విచ్చలవిడిగా మాఫియా జరుగుతుంది కాంగ్రెస్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతుకూరి సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బద్దూరి వెంకటరామిరెడ్డి వై ప్రకాష్ ప్రజల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగ జిల్లా కార్యదర్శి వై జానకి జిల్లా నాయకులు ఐ వెంకన్న,జి రమేష్, సిపిఐ ఎంఎల్ న్యూడెమో ఖమ్మం నగర కార్యదర్శి పాముల మోహన్ రావు, ఎస్ కే సుబహాన్, శ్రీకాంత్,షబ్బీర్ ,ప్రసాద్,శ్రీనివాస రెడ్డి పేర %శీ% వెంకటేశ్వర్లు ఎల్లయ్య, పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ సర్వేందర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీగల ఆఫీసర్ పై నిందలు వేయడం సబబు కాదు

### -ఎంపీఓపై అసత్య ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోం
### -పినపాక సెక్రటరీల సంఘం హెచ్చరిక



పినపాక/తరంగాలు

పినపాక ఎంపీఓ వెంకటేశ్వరరావు పై అసత్య ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుకోవాలని చూస్తే చూస్తూ ఊరుకోమని పినపాక సెక్రటరీల సంఘం మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, పినపాక మండల కార్యదర్శిలు హెచ్చరించారు. మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో పినపాక ఎంపీడీవో కార్యాలయంలో సెక్రటరీలు మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీల సంఘం నాయకులు మాట్లాడుతూ తమపై ఎంపిఓ ఎటువంటి ఒత్తిడిలకు గురి చేయలేదని, కేవలం ఒక అధికారిగా పని మాత్రమే చేయాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. వృత్తిపరమైన అంశాలలో అసత్య ప్రచారాలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఒకటి రెండు పత్రికలు పని పట్టుకొని అదే విధిగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయన్నారు. పత్రికలు నిజాలు రాసి పాత్రికేయ విలువలు కాపాడాలని కోరారు. రికార్డుల్లో అనేక మెలకువలను తమకు నేర్పారన్నారు.తమపై కోపగించుకున్న ఒక ఉపాధ్యాయుడు విద్యార్థుల మాత్రమే తమకు సెక్రటరీలుగా తమకు తెలియని పనులను నేర్పారన్నారు ఎంపీఓపై వచ్చిన అసత్య ప్రచారాన్ని ముక్తకంఠంతో ఖండిస్తున్నామని తెలియజేశారు. పత్రికల పేరుతో తమ వద్ద డబ్బులు వసూలు చేశారనటంలో ఎటువంటి నిజం లేదన్నారు . ఆధారాలు లేని వార్తలు రాసి తమను ఇబ్బంది పెట్టవద్దని తెలియజేశారు. ఇలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సైతం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 23 గ్రామ పంచాయతీల సెక్రటరీలు జయపాల్ రెడ్డి, ఉమామహేశ్వరరావు, సాయి, నాగిని, అరుణ శ్రీ, సాంబశివరావు, జ్యోతి, ఆదినారాయణ, పద్మ, సావిత్రి, ప్రశాంతి, చంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు .

# ఆలోజికి అభినందనలు తెలిపిన అక్బరుద్దీన్



తరంగాలు/మహబూబాబాద్/

ఆలోజి సాధించిన విజయాలకు గాను మాజీ ఇండియన్ టీం క్రికెట్ కెప్టెన్ అజారుద్దీన్ కుమారుడు అక్బరుద్దీన్ అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో రెండు బంగారు పతకాలు సాధించిన నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆలోజీ నాయక్ చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తున్నాడని. ఈ యువకుడికి క్రీడలు అంటే ప్రాణం పాఠశాల స్థాయి నుంచి జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిలో పాల్గొని ఎన్నో పథకాలు సాధించాడని. తర్వాత నేపాల్, శ్రీలంక లో జరిగిన అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో భారతదేశానికి రెండు బంగారు పథకాలు సాధించి యువకులందరికో ఆదర్శంగా నిలిచిన పరుగుల వీరుడు ఆలోజీ నాయక్ ను మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో జరిగిన సేవాలాల్ మహారాజ్ క్రికెట్ టోర్నమెంట్ కు ఫైనల్ మ్యాచ్ కి ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఇండియన్ టీం క్రికెట్ కెప్టెన్ అజారుద్దీన్ కుమారుడు అక్బరుద్దీన్, ఆలోజీ కీ అభినందనలు తెలిపారు. ఇంకా మరిన్ని విజయాలు సాధించాలని ఇస్లావత్ అలోజి నీ కోరారు.

# చదువుతోపాటు ఆటలలో రాణించాలి



తరంగాలు/కేసముద్రం/ నెహ్రూ యువ కేంద్రియ బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ ఆధ్వర్యంలో మంగళవారం కేసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరియు బహుమతులు ప్రధానం చేసి, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి యువత అని నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ ద్వారా స్కూల్ పిఈటి రాజేందర్ అన్నారు. నెహ్రూ యువ కేంద్రీం వరంగల్ డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ చింతల అనేవేష్ ఆదేశాల మేరకు ఇనుగుర్తి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేసముద్రం మరియు ఇనుగుర్తి విద్యార్థులతో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ ద్వారా స్కూల్ పి టి రాజేందర్ నెహ్రూ యువ కేంద్రీయ వాలంటరీ జాటోత్ వినోద్ నిర్వహించడం జరిగింది. బ్లాక్ లెవెల్ స్థాయి నుంచి ఆటల పోటీలు కబడ్డీ, రన్నింగ్, వాలీబాల్ తదితర ఆటల పోటీలలో తమ ప్రతిభను చూపి చదువుతో పాటు క్రీడలో కూడా విద్యార్థులు చురుకుగా రాణించాలని బాగా ఆడి జిల్లా స్థాయి మరియు జాతీయ స్థాయిలో ఆడి దేశానికి మంచి పేరు తీసుకురావాలని, చదువుతోపాటు క్రీడను కూడా ప్రతిరోజు అలవాటు పరుచుకోవాలని, క్రీడల ద్వారా మంచి ఆరోగ్యము, రోజంతా ఉల్లాసంగా ఉంటుందని. ఆటల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆంగ్లం డిక్షనరీ, గ్రామర్ పుస్తకాలు, కరెంట్ అఫైర్స్ బహుమతులుగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కేసముద్రం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు, ఇనుగుర్తి ప్రధానోపాధ్యాయురాలు రూప రాణి మేడం, పిఈటీ రాజేందర్ సార్, ఎన్. ఎఫ్. హెచ్. సి. ఫౌండేషన్ బ్రాండ్ అంబాసిడర్, యశ్వంత్ మౌంటైనీర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ రమేష్, నెహ్రూ యువ కేంద్రం నేషనల్ వాలంటరీ జాటోత్ వినోద్, తరుణ్, సుమన్, వరుణ్ మరియు విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రతి పేదవానికి న్యాయం

### -జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి



తరంగాలు/కేసముద్రం/

కేసముద్రం మండలం అమీనాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగం చేసిన పేదలకు ఉచిత విద్యుత్ అందిస్తానని కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలలో ని పథకాన్ని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు నెలల లోపే అన్న మాట ప్రకారం ఉచిత విద్యుత్తునుగృహ జ్యోతి పథకం కింద ఇచ్చేటువంటి కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి ఎస్సీ కాలనీలో పర్యవేక్షించి జీరో బిల్లును లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల కోసం పనిచేసే పార్టీ, అధికారం చేపట్టిన రెండు నెలల లోపే మహిళలకు ఉచిత బస్సు, పది లక్షల వరకు ఆరోగ్యశ్రీ పథకాన్ని పెంచడం, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ ఇవ్వడం, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ ఇచ్చే పథకాలను ప్రారంభించడం జరిగింది. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లను కూడా ప్రారంభించడం జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా ఆరు గ్యారెంటీలను అమలుచేసి పేద ప్రజలందరికీ పార్టీలకతీతంగా పథకాలను చేరే విధంగా మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ మురళి నాయక్ కృషి చేస్తానని ప్రతి సమావేశంలో వారు చెప్పడం జరుగుతోంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 100 పథకాలు ప్రవేశపెట్టి ఒక పథకాన్ని కూడా పేదలకు అందించే విధంగా చేయకుండా కేవలం గులాబీ కండువా వేసుకున్న కార్యకర్తలకే పథకాలు ఇవ్వడం జరిగింది. కానీ కాంగ్రెస్ పార్టీ పేదల అభివృద్ధి ధ్యేయంగా ముందుకు నడుస్తూ మహబూబాబాద్ నియోజకవర్గ డాక్టర్ మురళి నాయక్ నాయకత్వంలో రాబోయే ఐదు సంవత్సరాలలో అభివృద్ధి పదంలో ముందుకు నడుస్తూ ప్రతి పేదవానికి న్యాయం జరిగే విధంగా పథకాలు అందే విధంగా కృషి చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ అంబటి లక్ష్మి, దామర కొండ ప్రవీణ్ కుమార్, కల్లెం శ్రీనివాస్ రెడ్డి, లింగాల నేతాజీ, సామ సుధాకర్ రెడ్డి, జన్ను కట్టయ్య, ఇనుముల కర్ణాకర్, జన్ను శ్రీనివాస్, కుక్కమూడి సురేష్, మడుపు శ్రీనివాస్, ఎర్రం శెట్టి అశోక్, భోగం రమ, అల్లరి ఎల్లయ్య, కొనకటి మహేందర్, కొడారి .నాగేంద్రబాబు పాల్గొన్నారు

## ఖమ్మం నూతన కలెక్టరేట్ నందు నాలుగు నూతన లహరి ( ఏ/సి) బస్సులు ప్రారంభం



తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం : ఖమ్మంలో నూతన కలెక్టర్ ఆఫీస్ ముందు నూతన లహరి ఏసీ బస్సులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ జెండా ఊపి ప్రారంభించారు.మొత్తం 20 బెర్త్ లు మరియు 22 సీట్లతో కూడిన బస్సులో అత్యాధునిక సదుపాయాలతో, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని ప్రయాణీకులకు అందించడమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని, మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలియజేశారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ శ్రీ. వి. పి. గౌతమ్ రిబ్బన్ ను కట్ చేసి, లహరీ బస్సులను ప్రారంభించారు.సురక్షితమైన, సుఖవంతమైన మరియు సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని పొందడానికి ప్రజలు ప్రయాణికులు ఆర్టీసీ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజనల్ మేనేజర్ శ్రీ.వెంకన్న విజ్ఞప్తి చేశారు. లహరి బస్సులలో అందించబడే సదుపాయాలు: సౌకర్యవంతమైన సీటింగ్వె హికల్ ట్రాకింగ్ సిస్టం, ఫైర్ డిడక్షన్ %ః%అలారం సిస్టమ్సి సి కెమెరా ,స్పీకర్అ నౌన్స్మెంట్,వైఫై ఫెసిలిటీ, మొబైల్ ఛార్జింగ్ ఫెసిలిటీ, వాటర్బా టిల్ హోల్డర్స్ కలవు. ఈ బస్సులు ఖమ్మం నుండి బెంగళూరు వరకు నడపబడుతుంది. చార్జి వివరాలు బెర్త్ %=ం% 2690/- మరియు సీట్ %=ం% 1870/-చార్జి వివరాలు: ఖమ్మం నుండి హైదరాబాదుకు: బెర్త్ రూ: 770/- సీట్ రూ.560/-గా చార్జ్ చేయబడుతున్నది. ఈ కార్యక్రమం లో డిప్యూటీ రీజనల్ మేనేజర్( మెకానికల్) భవానీ ప్రసాద్,ఖమ్మం మరియు మణుగూరు డిపో మేనేజర్లు ,ఆర్టీసీ సిబ్బంది మరియు కలెక్టరేట్ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వ, తరగతి విద్యార్థులకు ప్యాడ్ లు,రాత కిట్టు పంపిణీ

-భయాన్ని వీడాలి... చదువుపై ఆసక్తి పెంచుకోవాలి... చిలువేరు సమ్మయ్య గౌడ్

-చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్:చిలువేరు సమ్మయ్య గౌడ్


-విద్యార్థుల పట్ల సమ్మి గౌడ్ కి ఉన్న స్పందన చూసి అభినందించిన కాట్రపల్లి ప్రధానోపాధ్యాయులు దాసరి వీరభద్రం

-సేవే లక్ష్యంగా పేద విద్యార్థులకు సహాయాన్ని అందించడం గర్వించ దగ్గ విషయం కాట్రపల్లి కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు జల్లేయాకాంబరం

-సమాజం పట్ల సమ్మిగౌడ్ ఫౌండేషన్ సేవలు హర్షణీయం ఉప్పరపల్లి ప్రధానోపాధ్యాయులు విజయ సుశీల







తరంగాలు/కేసముద్రం/

చదువుకు పేద,ధనిక అనే తారతమ్యాలు లేవని మంచి మేధా సంపత్తితో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని అప్పుడే తను చేరుకోవాలనుకున్న గమ్యాన్ని చేరవచ్చని సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ,గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ అన్నారు. కేసముద్రం మండలంలోని ఉప్పరపల్లి,కాట్రపల్లి పాఠశాలలలోని ప్రధానోపాధ్యాయుల అధ్యక్షతన నిర్వహించిన సమావేశ కార్యక్రమం లో సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిలువేరు సమ్మయ్యగౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిలువేరు సమ్మయ్యగౌడ్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ యొక్క లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్యం దిశగా ప్రయాణిస్తూ భయాన్ని విడాలని చదువుపై ఆసక్తి పెంచుకోవాలని ఉన్నత మైన శిఖరాలను అధిరోహించాలని దానికి పేద,ధనిక మధ్య తరగతి అనేవి అడ్డు కాదని ఉన్నతమైన చదువుతో కూడిన ప్రతి విద్యార్థి గొప్ప స్థాయిలో ఉన్నతమైన స్థితిలో ఉంటాడని అటు చదువు చెప్పిన గురువులకు ఇటు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలను తీసుకొచ్చి గ్రామంలో మంచి గుర్తింపు పొందాలని అన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఎల్లప్పుడు మీకు అందుబాటులో ఉంటుందని,పేదరికంలో ఉన్నటువంటి ఏ విద్యార్థి అయినా మా ఫౌండేషన్ ను సంప్రదించి నట్లయితే వారి యొక్క బంగారు భవిష్యత్తుకు ఆర్థిక సహాయం చేస్తూ వారికి చేదోడు వాదోడుగా ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు దాసరి వీరభద్రం మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ తో ఉన్నపుడే వారి జీవితంలో అన్ని రంగాలలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని, సమ్మయ్య గౌడ్ విద్యార్థులకు ఉత్సాహకరంగా ఉండేవిధంగా ఆయన విద్యార్థులకు చేస్తున్న సేవలు మరువలేనివని,సమ్మి గౌడ్ చేస్తున్న సేవలను అభినందించారు. అదేవిధంగా ఉప్పరపల్లి ప్రధాన ఉపాధ్యాయులు విజయ సుశీల మాట్లాడుతూ మండల కేంద్రంలో సమ్మి గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకే కాక ప్రతి గ్రామంలో తను అందజేస్తున్న సహాయం చెప్పుకోలేని ఎక్కడైనా సరే ఆపద ఉంది అని తెలిస్తే చాలు ఎదురు చూడకుండానే సహాయాన్ని అందజేసే గుణం ఉన్న ఉన్నతమైన వ్యక్తి సమ్మయ్య గౌడ్ అని అన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్,రాత పరీక్షకు సంబంధించిన సామగ్రి కిట్టులను, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో సమ్మిగౌడ్ ఫౌండేషన్ తరపున పదవ తరగతి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఇంటికన్నె పాఠశాల ఉపాధ్యాయురాలు సుజాత మాట్లాడుతూ విద్యార్థుల ప్రోత్సహించేందుకు విచ్చేసినటువంటి సమ్మిగౌడ్ ను అభినందిస్తూ ,ఇలాంటివారు సమాజంలో ఉండటం వల్లనే పేద విద్యార్థులకు ఒక భరోసా కలుగుతుందని, విద్య పట్ల ఉన్నతమైన ఆలోచనలతో మంచి స్థాయికి ఎదుగుతారని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బండారు వేణు గౌడ్, విద్యా కమిటీ చైర్మన్ తండా శ్రీనివాస్ గౌడ్, పలుస వెంకన్న, పబ్బతి సారంగం, కంది రవి,అడప రమేష్, ఎటు రోజు పరిపూర్ణాచారి, కోమాకుల వెంకన్న, పెదగాని వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు జల్లే యాకాంబరం,మాజీ ఉపసర్పంచ్ పుల్ల శ్రీనివాస్ యాదవ్,చీకటి ప్రశాంత్,పుట్ట ప్రభాకర్ గౌడ్,సురేష్ గౌడ్, ఉపేందర్,శ్రీను, రాజేందర్,మొగిలి, వెంకన్న శ్రీనివాస్ అవినాష్,మహేష్,కోతి బాల జగన్ గౌడ్, గుంజ మల్లేష్,గంధసిరి మల్లేష్, గంధసిరి వెంకటేష్, దొమ్మాటి శ్రవణ్, నల్ల మాస సందీప్, వర్ధిల్లి రంజిత్, ఉపాధ్యాయులు యాకాంబరం,కోటేశ్వర్, రవీందర్,కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళీ దేవస్థానంలో మహాశివరాత్రి మహోత్సవాలు

తరంగాలు /హన్మకొండ ప్రతినిధి

వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో మహాశివరాత్రి మహోత్సవాలు మంగళవారం రోజు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవస్థానంలో మహారుద్రయాగం పరమ పవిత్రంగా పాంచాహ్నిక (ఐదు రోజులు) దీక్షతో నిర్వహింపబడుతోంది. దక్షిణ భారత దేశంలో తమిళనాడులో పంచభూత లింగాలుగా ఆంధ్రప్రదేశ్లో పంచారామాలుగా వేరువేరు గ్రామాలలో శంకరుడి యొక్క పంచముఖ లింగ క్షేత్రాలు నెలకొనియుండగా తెలంగాణా రాష్ట్రంలో అట్టి పంచముఖ లింగ క్షేత్రాలు కాకతీయుల రాజధాని ఏకశిలా నగరంగా చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ మహానగరంలో ఒకే చోట ఈ పంచభూత లింగాలు నెలకొని యుండటం ఇక్కడ విశేషం.అవి యేమనగా ఖిలా వరంగల్ (వరంగల్ కోటలో) స్వయంభూ (శంభు) లింగేశ్వర స్వామి దేవాలయం పృథ్వీ లింగంగా,మటియవాడ (మట్టెవాడ)లో భోగేశ్వరాలయం జలలింగంగా, శ్రీ భద్రకాళి దేవాలయంలోని భద్రేశ్వరస్వామి ఆలయం తేజోలింగంగా, హనుమకొండలోని సిద్ధేశ్వరాలయంలో వాయులింగంగా,కాజీపేటకు దగ్గరగా మడికొండ, మెట్టుగుట్టపైనున్న శ్రీ మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆకాశ లింగంగా శంకరుని యొక్క పంచభూతాత్మక పంచముఖలింగ క్షేత్రాలు (సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష, ఈశాన ముఖములు) స్వయం వ్యక్తమైన శైవ క్షేత్రాలుగా పౌరాణిక, చారిత్రకంగా ప్రసిద్ధిగాంచాయి. ఈ పంచముఖ లింగాలను





మహాశివరాత్రినాడు వరంగల్ ప్రజలు తప్పక దర్శించి తీరుతారు. తద్వార జన్మజన్మాంతార్జిత ప్రారబ్ధవశమున పీడింపబడే మానవుల ఈతి బాధలు తొలగిపోయి సకలైశ్వర్యాలు కలిగి జనులు వర్ధిల్లుతారనేది భక్తుల విశ్వాసం. ఈ క్రమంలో భద్రకాళీ దేవస్థానంలోని తేజోలింగం (అగ్ని ముఖలింగం) భద్రేశ్వరస్వామి దర్శనం దారిద్ర్యాన్ని తొలగించి అమితమైన ఐశ్వర్యాన్ని ఇస్తాడని భక్తుల విశ్వాసం మరియు సాధకులకు అనుభవ వేద్యం.కావుననే భక్తుల సకలాభ్యుదయ నిశ్రేయస పరంపరా ప్రాప్తి కొరకు మహారుద్ర యాగం ప్రతి సంవత్సరం భద్రకాళీ దేవాలయంలోని శివాలయంలో నిర్వహింపబడుతోంది. ఈ ఉత్సవాలకు సోమవారం అంకురార్పణ జరుపబడగా మంగళవారం రోజు ద్వాదశ లింగతోభద్రమండల రచన జరుపబడి అట్టి మండలంపై 11 కలశాలు ఏర్పాటు చేసి అట్టి కలశాలలో ఏకాదశ రుద్రులను ఆహ్వానించి మహారుద్రయాగాన్ని ప్రారంభించారు. మహాశివరాత్రి మార్చి 8వ తారీకు శుక్రవారం వరకు ఈ యాగం నిర్వహింపబడుతుంది. శక్తి ఆరాధనా క్రమంలో శాస్త్రములు ఈ మహాశివరాత్రిని అమ్మవారి యొక్క దశవిధరాత్రులలో మహారాత్రిగా అభివర్ణించాయి. ఈ రోజున అమ్మవారిని దర్శించిన భక్తుల సమస్త ఈతి బాధలు నశించిపోయి ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలుగుతాయని వేలాది మంది భక్తులు దేశంలోని పలు ప్రాంతాల నుండి వరంగలు విచ్చేసి భద్రకాళీ అమ్మవారిని దర్శిస్తారు. మహాశివరాత్రి భగవత్ దర్శనంతోపాటు భగవన్నామ స్మరణతో జాగరణ కూడా అత్యంత ముఖ్యమని బాలలు,వృద్ధులు, శారీరక దౌర్బల్యంలేని ప్రతీవారు ఈ మహాశివరాత్రి రోజున శివాలయాలను,అమ్మవారి ఆలయాలను దర్శించి రాత్రంతా భగవన్నామ స్మరణతో జాగరణ చేయడం ద్వారా భక్తుల కోర్కెలు నెరవేరడమేకాకుండా దేహాంతంలో ముక్తి లభిస్తుందని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేష తెలిపారు. ఈ ఉత్సవాలలో అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు కావలసిన మంచినీటి వసతి, ప్రసాదం తదితర ఏర్పాట్లు విరివిగా చేయబడ్డాయని ఆలయ ఈ.ఓ శ్రీమతి శేషభారతి తెలిపారు.

# పరకాలలో ఖాళీ అవుతోన్న బీఆర్ఎస్

-కాంగ్రెస్ గూటికి పరకాల మున్సిపాలిటీ కౌన్సిల్ సభ్యులు

-రాష్ట్ర బాధ్యులు దీపాదాస్ మున్షీ సమక్షంలో చేరిక

-శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం

తరంగాలు /హన్మకొండ ప్రతినిధి

సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్న ఫలాలను చూసి బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారంతా ఒక్కొక్కరుగా హస్తం గూటికి చేరుతున్నారు. ఫలితంగా బీఆర్ఎస్ క్యాడర్ రోజు రోజుకు ఖాళీ అవుతోంది.పరకాల మున్సిపాలిటీ కౌన్సిల్ కు చెందిన ఎనిమిది మంది సభ్యులు, అలాగే నడికుడ మండలానికి చెందిన ఎనిమిది మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ కండువా



కప్పుకున్నారు.పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర బాధ్యులు దీపాదాస్ మున్షి ఒక్కొక్కరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.పార్టీ ప్రజా పాలన విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని,క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని సూచించారు. పార్టీలో చేరిన పరకాల మున్సిపాలిటీ కౌన్సిలర్లు సోద అనిత రామకృష్ణ- చైర్పర్సన్,సారయ్య,పోరండ్ల సంతోష్,నల్లాల జ్యోతి అనిల్ కుమార్,పసుల లావణ్య రమేశ్,బండి రాణి సదానందం గౌడ్,మార్క ఉమ రఘుపతి గౌడ్,ఏకు రాజు లు వారితోపాటు నడికుడ మండలం నుంచి కొడెపాక స్వర్ణలత కరుణాకర్- జడ్పిటిసి,గోల్కొండ ఉమ సదానందం- ఓడిసిఎంఎస్ వైస్ చైర్మన్,శనిగరపు నీల సమ్మయ్య- సర్పంచ్ నార్లపూర్,పెండ్లి రాజు- సర్పంచ్ రామకృష్ణాపూర్,ముక్కెర సురేష్- బీఆర్ఎస్ వైస్ ప్రెసిడెంట్, నడికుడ,ఇనుగాల రవీందర్- బీఆర్ఎస్ సీనియర్ నాయకులు,కొడెపాక మోహన్ బాబు,బొల్లె మధుకర్- బీ ఆర్ఎస్ సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరినారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షులు దొమ్మటి సాంబయ్య,మాజీ ఎమ్మెల్యే మొలుగూరి బిక్షపతి,రాష్ట్ర నాయకులు గన్నోజు శ్రీనివాసచారి,పరకాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్కూరి దేవేందర్ రెడ్డి,పట్టణ పార్టీ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్,నడికూడ మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్,కాంగ్రెస్ పార్టీకి చెందిన పరకాల కౌన్సిలర్ పంచగిరి జయమ్మ హరి,పరకాల మాజీ ఎంపీపీ రాంమూర్తి,సీనియర్ నాయకులు చందుపట్ల రాజిరెడ్డి,కొల్గూరి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్య అతిథిగా విచ్చేసిన మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కరుణాకర్



తరంగాలు /మిర్యాలగూడ ప్రతినిధి

పట్టణంలోని సుందరయ్య మున్సిపల్ పార్కులో మెప్మా రిసోర్స్ పర్సన్స్ రివ్యూ సమావేశము నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కరుణాకర్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మెప్మా పరిధిలో నిర్వహిస్తున్న అన్ని విషయాల మీద రివ్యూ చేయడం జరిగింది. రిసోర్స్ పర్సన్స్ టార్గెట్ అచీవ్మెంట్ బ్యాలెన్స్ తదితర విషయాల మీద రివ్యూ చేయడం జరిగింది. బ్యాంకు లింకేజీ, పీఎం స్వా నిధి , స్వా నిధి సే సమృద్ధి, పీఎం విశ్వకర్మ తదితర విషయాల పైన పూర్తిగా చర్చించడం జరిగింది. అదేవిధంగా శ్రీనిధి విషయంలో మిర్యాలగూడ పట్టణము వెను కంజ లో ఉందని దానిని అభివృద్ధిలోకి తీసుకురావాలని తెలియజేయడం జరిగింది. అదేవిధంగా పట్టణ పరిధిలోకి నివాస గృహాల యజమానులు మున్సిపాలిటీకి చెల్లించాల్సినటువంటి ఇంటి పన్ను బకాయిలలో వడ్డీ మీద 90 శాతం రాయితీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ఇస్తున్నదని అది కూడా ప్రజలందరికీ తెలియజేయాలని రిసోర్స్ పర్సన్ లకు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో మెప్మా డీఎంసీ శివాజీ నాయక్, టిఎంసి బక్కయ్య కమ్యూనిటీ ఆర్గనైజర్లు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు రిసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు

# మెట్టుగుట్ట శ్రీ రామలింగేశ్వరస్వామి ట్రస్ట్ బోర్డు చైర్మన్ గా పైడిపాల రవి చందర్

**-ప్రమాణ స్వీకారం చేయించిన వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు**

తరంగాలు /హనుమకొండ ప్రతినిధి

మంగళవారం రోజు హనుమకొండ జిల్లా కాజీపేట మండల పరిధిలోని మడికొండ శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా నియమితులైన పైడిపాల రఘుచందర్,ధర్మకర్తల చేత ప్రమాణం చేయించిన వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు, ఈ కార్యక్రమంలో జక్కుల రవీందర్ యాదవ్ 62వ డివిజన్ కార్పొరేటర్ పాల్గొనడం జరిగింది... అనంతరం ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీ మెట్టుగుట్ట దేవాలయం చైర్మన్ గా పదవి బాధ్యతలు చేపడుతున్న పైడిపాల రఘుచందర్, కమిటీ మెంబర్లకు శుభాకాంక్షలు తెలియజేసి,మెట్టుగుట్టపై ఉన్న గోశాలకు పాలరాయితో చేసిన కృష్ణుని విగ్రహాన్ని,రేకుల షెడ్డును సొంత ఖర్చులతో అభివృద్ధి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న నాయకులకు ఘనంగా సన్మానం చేసిన కమిటీ సభ్యులు... ఈ కార్యక్రమంలో ఈవో శేషుభారతి,నిమ్మని శేఖర్రావు,మర్రి ప్రభాకర్,కుర్ల మోహన్, బైరి లింగమూర్తి,వస్కుల శంకర్, కొప్పుల నవీన్,మస్కుల శీను, గుర్రం అమర్నాథ్,అర్జున్,లుమేష్, యూత్ సభ్యులు,ప్రధాన అర్చకులు,వేద పండితులు, దేవాలయ కమిటీ సభ్యులు, వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్ రావు,మర్రి





ప్రభాకర్,మాల మహానాడు జాతీయ నాయకులు మన్నే బాపు రావు,64 డివిజన్ కుర్ల మోహన్,కంటెస్టెడ్ కార్పొరేటర్ బైరిలింగమూర్తి,వస్కుల శంకర్, నాగరాజు,సదానందం గౌడ్, మడికొండ, కాజీపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఆలయ ఈవో శేషు భారతి,అర్చకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణ పూర్తి చేసుకొని జిల్లాకు చేరుకున్న "కాకర్ స్పానియల్" జాతికి చెందిన పోలీస్ జాగిలం



తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :

నేర దర్యాప్తు సమయంలో పోలీసు జాగిలాల సేవలు ఎంతో కీలకమని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పేర్కొన్నారు.మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీలో (ఎక్స్ప్లోసివ్) పేలుడు పదార్థాలను కనుగొనడంలో హాండ్లర్ కానిస్టేబుల్ ఎస్ కే.పాషా ప్రత్యేక శిక్షణలో 8 నెలల పాటు కఠోర శిక్షణ పూర్తి చేసుకొని జిల్లాకు చేరుకున్న "కొకర్ స్పానియల్" జాతికి చెందిన 10 నెలల పూనమ్ అనే జాగిలాన్ని పోలీస్ కమిషనర్ అభినందించారు. సంక్లిష్టమైన కేసుల పరిశోధన, ఛేదనలో అత్యంత కీలక పాత్ర వహించేలా విధుల్లో మరింత ప్రతిభ కనబరుస్తాయని తెలిపారు.మొయినాబాద్ శిక్షణ కేంద్రంలో 21 జాగిలాలకు 8 నెలల పాటు 28 మంది హాండ్లర్స్ (శిక్షకులు) ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.21 జాగిలాలలో ప్రధానంగా లాబ్రడార్, జర్మన్ షెపర్డ్, బెల్జియం మాలినాయిస్, కాకర్ స్పానియల్, గోల్డెన్ రిట్రీవర్ జాతులకు చెందినవి ఉన్నాయని హాండ్లర్స్ వివరించారు.కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ నర్సయ్య, ఆర్ ఐ కామరాజు పాల్గొన్నారు.

# వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 54 వ డివిజన్ లో ఎమ్మెల్యే పర్యటన

**-పోచమ్మకుంటను మోడల్ డివిజన్ గా మారుస్తా..**
**-డివిజన్ పర్యటనలో పశ్చిమ శాసన సభ్యులు నాయిని**

తరంగాలు /హన్మకొండ ప్రతినిధి

మంగళవారం రోజు హన్మకొండ 54 వ డివిజన్ పోచంమకుంట లో వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి డివిజన్ పర్యటన చేసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.హనుమాన్ దేవాలయం ఎదుట అపూర్వ ఎంక్లేవ్ వద్ద 20 లక్షలతో పైప్ లను అభివృద్ధి పనులను ప్రారభించారు.మహిళా సంఘాలకు, వడ్ల సంఘాలకు ఉప్పర కుల సంఘాలకు కమ్యూనిటీ హాల్స్ ఏర్పాటు చేస్తానని అన్నారు కాలనీలో తిరుగుతూ రోడ్లు, డ్రైన్ ను మున్సిపల్ ఏ.ఈ. డి.ఈ లతో కలిసి పరిశీలించడం జరిగింది. అలాగే డివిజన్ లో పోచమ్మ స్మశాన వాటికిను మోడల్ స్మశాన వాటికను చేస్తానని, డివిజన్ ను మోడల్ డివిజన్ గా మారుస్తానని అన్నారు. అవసరమైన వాటికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఏ.ఈ. డి.ఈ. లను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, పోతుల శ్రీమాన్,గుంటి కుమార్,కూర సురేందర్, మాజీ కార్పోరేటర్లు తాడిశెట్టి



విద్యాసాగర్ , వీరగంటి రవీందర్, 54 వ డివిజన్ అద్యక్షుడు కొండుక ప్రదీప్ కుమార్, నల్ల సత్యనారాయణ, గుంటి స్వప్న, వరుణ్ గౌడ్, సుమన్, సురేష్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# బియ్యం అక్రమ రవాణా చేస్తున్న నలుగురు నిందితులు అరెస్ట్

**-జిల్లా యస్.పి చందనా దీప్తి ఐపియస్**

తరంగాలు మిర్యాలగూడ ప్రతినిధి

**వీరి వద్ద నుండి 75 కింటాల్ పీడీఎస్ బియ్యం, మరియు రవాణా చేయుటకు ఉపయోగిస్తున్న ఒక అశోక్ లేలాండ్ ట్రాలీ వాహనం మరియు మహీంద్రా బొలరో ట్రాలీ వాహనం స్వాధీనం.**


ప్రజా సంక్షేమం దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న పి.డి.ఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తూ పేద ప్రజలకు అందకుండా పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ రోజు జిల్లా యస్.పి ఆదేశాల మేరకు నమ్మదగిన సమాచారం మేరకు నల్గొండ జిల్లా టాస్క్ ఫోర్స్ టీం నాంపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది సమన్వయంతో మెల్లవాయి గ్రామం వద్ద ఉన్న మల్లికార్జున రైస్ మిల్లు వద్దకు చేరుకుని తనిఖీ చేయగా అశోక్ లేలాండ్ ట్రాలీ ఆటో మరియు మహీంద్రా బొలెరో ట్రాలీ లోడ్ లో 75 కింటాల్ పీడీఎస్ బియ్యం బస్తాలు అక్రమ రవాణాకు





సిద్ధంగా ఉన్నాయి. దానిపై రైస్ మిల్లు యజమానిని విచారించగా 1. వీరమల్ల మల్లికార్జున్ తండ్రి జనార్దన్, 2. వీరమల్ల రమేష్ అలవయ్య, నాంపల్లి. వీరు మండల గ్రామస్తుల నుండి చౌక ధరలకు బియ్యాన్ని సేకరించి ట్రాలీ ద్వారా కల్వకుర్తి మరియు నాగర్ కర్నూల్‌లోని పౌల్ట్రీ ఫారాలకు విక్రయిస్తున్నారు అని తెలపగా వీరితో పాటు అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు డ్రైవర్ల పైన కేసు నమోదు చేసి 75 కింటాల్ పీడీఎస్ బియ్యం ను స్వాధీనం చేసుకోవడం జరిగింది తెలిపారు. ఈ సందర్భంగా యస్.పి గారి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల చట్టవ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలైన గంజా,జూదం బెట్టింగ్,అక్రమ పీడీఎస్ రైస్ రవాణా, లాంటి వాటిని అరికట్టేందుకు నిరంతరం నిఘా పెడుతూ స్పెషల్ డ్రైవ్ లు చేస్తూ విస్తృత స్థాయిలో దాడులు నిర్వహిస్తున్నామని అన్నారు. పేద ప్రజల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పక్కదారి పట్టించిన, ప్రజల ఆహార భద్రతకు భంగం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.ఈ లాంటి నేరాలు అలవాటుగా చేస్తున్న వారి పై ఆక్ట్ చట్టం నమోదు చేస్తామని అన్నారు.అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయడం కోసం పోలీసు శాఖ నిరంతరం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుందని అన్నారు. నిందితుల వివరాలు 1.వీరమల్ల మల్లికార్జున్ తండ్రి జనార్దన్, వయస్సు: 44, కులం: వైశ్య,: వ్యాపారం, : నాంపల్లి. 2.వీరమల్ల రమేష్ / అలవయ్య, వయస్సు: 44,: వ్యాపారం, కులం: వైశ్య,: నాంపల్లి. 3.ఎడ్ల తిరుపతయ్య / లింగయ్య, వయస్సు: 33,: కొట్రా , వెల్దండ ,నాగర్ కర్నూల్ జిల్లా. 4.నాయిని సంపతయ్య/పెద బాలయ్య, వయస్సు: 40,: తిమ్మాయిపల్లి చారకొండ , నాగర్ కర్నూల్ జిల్లా.

## ఉత్తమ సేవ పురస్కారం అందుకున్న రంగు రఘుపతి నేత



తరంగాలు /హన్మకొండ ప్రతినిధి

సోమవారం తేదీ 4/3/2024 రోజున విశాఖపట్నం జిల్లాలో శ్రీ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఉత్తరాంధ్ర 4 జిల్లాలకు కేంద్రం గా వైజాగ్ లో ఐడల్ గంధర్వ - ఏ పి 2024 లోగో ప్రారంభోత్సవ సందర్భంగా ఘంటసాల స్మారక పీఠం వ్యవస్థాపకులు,ఘంటసాల స్వర సామ్రాట్ డాక్టర్ శరత్ చంద్ర పిలుపు మేరకు మన రంగు రఘుపతి నేత కాకతీయ మ్యూజికల్ క్లబ్ - వ్యవస్థాపకులు,వర్కింగ్ ప్రెసిడెంట్ మార్చి 4వ తేదీన విశాఖపట్నం లో జరిగిన ఐడల్ గంధర్వ సూపర్ సింగెర్స్ సెలక్షన్ లో దాదాపు 20 మంది గాయని,గాయకులకు కాకతీయ మ్యూజికల్ క్లబ్ ద్వారా పాల్గొనేలా చేసినందుకు గాను సినీ హీరో సుమన్,శివా రెడ్డీ చేతుల మీదుగా ఉత్తమ సేవ పురస్కారం అవార్డ్ అందుకోవడం జరిగింది... ఇట్టి మహత్తర కార్యానికి సహకరించిన ప్రొఫెసర్ వి. తిరుపతయ్య, బి శ్రీమన్నారాయణ,నల్ల లక్ష్మినారాయణ,అడ్వకేట్ వి.రవికుమార్,కాకతీయ మ్యూజికల్ క్లబ్ కార్యవర్గం సభ్యులందరికీ రంగు రఘుపతి నేత పేరు పేరున ధన్యవాదాలు తెలియజేశారు.

# కేసీఆర్ పై సమగ్ర విచారణ జరపాలి

**-సీఎం రేవంత్ రెడ్డిని కోరిన టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్...**





తరంగాలు/హైదరాబాద్:

తెలంగాణలో ఐదారు నెలల తర్వాత కాంగ్రెస్ సర్కారు ఉండదని బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడటం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటిదని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ ఖండించారు. మంగళవారం హైదరాబాద్ లో అయన ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని పడగొట్టే ఆలోచనలు చేస్తున్న కేసీఆర్ పై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో చాలామంది కాంగ్రెస్ తో టచ్ లో ఉన్నారన్న సంగతి తెలుసుకొని, వారు పార్టీ నుంచి వెళ్లిపోతారనే భయంతోనే, నిస్సహాయ పరిస్థితుల్లోనే కేసీఆర్ పైపైకి బీరాలు పలుకుతున్నాడని సుధాకర్ గౌడ్ పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పు మాత్రమే ఫైనల్ అనే విషయాన్ని మాజీ సీఎం కేసీఆర్ మరిచిపోతే ఎలా? అని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యబద్ధంగా పూర్తి మెజారిటీతో ఏర్పాటై, ప్రజా రంజకంగా పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేసీఆర్ ఎలా పడగొడతారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ కు ఉన్న సంఖ్యాబలం, ప్రజాబలం చూస్తే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎవరూ ఏమీ చేయలేరని గుర్తు చేశారు.అయితే, కేసీఆర్ ఇంకా తానే సీఎం అనే భ్రమల్లో ఉన్నాడని, తమ కుటుంబం అక్రమంగా సంపాదించిన డబ్బుతో కేసీఆర్ ఓ సినిమా తీసి, అందులోనైతే తానే సీఎం పాత్రలో నటించవచ్చు కదా.. అని ఎద్దేవా చేశారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే కేసీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని పడగొడతా మంటున్న కేసీఆర్ పై సమగ్ర విచారణ జరపాలని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుమ్మేటి సమ్మిరెడ్డి ఉన్నారు.

# అందాల ఆరబోతలో పోటీపడుతున్న రాశీఖన్నా



టాలీవుడ్ సుందరి రాశీ ఖన్నా అందాల ప్రదర్శనలో ఏమాత్రం తగ్గడం లేదు. రోజురోజు అంతకుమించి అనేలాదూసుకెళుతుందే తప్పితే ఎక్కడా వెనకడుగు వేయడం లేదు. ప్రస్తుతం టాలీవుడ్‌ను సైడ్‌కు పెట్టి పూర్తిగా బాలీవుడ్ పైనే దృష్టి పెట్టిన ఈ ముద్దుగుమ్మ అక్కడ పోటీలో నిలబడేందుకు, అవకాశాలు పట్టేయడానికి గ్లామర్ డోస్ పెంచుతూ పోతూ ఇక్కడ కుర్రాళ్ల గుండెల్లో మంటలు పెడుతోంది.వారం రోజుల క్రితం అసలు బట్టలు ఉన్నాయా లేవా అనే విధంగా బట్టలు వేసుకుని ఫొటోషూట్లు చేసిన ఈ చిన్నది.. మళ్లీ ఇప్పుడు అదే స్థాయిలో అందాల ప్రదర్శన చేసి అభిమానులకు కనులవిందు చేసింది.తాజాగా రెడ్ అవుట్ ఫిట్‌లో డ్రెస్‌ను జార విడిచి మరి అందాలను చూపిస్తూ మెస్మరైజ్ చేసింది. దీంతో అభిమానులు సినిమాలు లేకున్నా ఫర్లేదు మూడు రోజులకోసారి ఈ మాత్రం దర్శనం ఇస్తే చాలు అనేంత వరకు ఫ్యాన్స్ వెళ్లి పోయారు. ప్రస్తుతం బాలీవుడ్‌లో సిద్దార్థ్ మల్హోత్రా తో కలిసి యోధ అనే వార్ ఓరియంటెడ్ సినిమాలో నటించగా అది త్వరలో విడుదలకు రెడీ అయింది. ఇక తెలుగులో డీజే టిల్లు స్టార్ జోన్నలగడ్డ సిద్దుతో కలిసి చేస్తున్న తెలుసుకదా అనే చిత్రం తప్పితే మరో చిత్రానికి సంతకం చేయలేదు.ఇక హిందీలో ఫర్జీ అనే వెబ్ సిరీస్ పార్ట్2 లో నటించనుంది.





## ప్రభాస్‌తో మళ్లీ సినిమా చేయాలని ఉంది
## భీమా చిత్ర విశేషాలను పంచుకున్న గోపీచంద్

విజయం కోసం పరితపిస్తున్న నటుల్లో గోపీచంద్ ఇప్పుడు 'భీమా' అనే సినిమాతో మార్చి 8న ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. మహా శివరాత్రి సందర్భంగా ఈ సినిమా విడుదలవుతోంది, ఈ సినిమా నేపథ్యం పరశురామ క్షేత్రం అని చెప్పారు. డిసెంబర్‌లో విడుదల చెయ్యాలని అనుకున్నా..అప్పట్లో 'సలార్' లాంటి పెద్ద సినిమా రావటం వల్ల వాయిదా వేసుకున్నారు. జనవరిలో కూడా పండగ సినిమాలు చాలా వున్నాయి, ఇక ఆలా వాయిదా పడుతూ ఇప్పుడు మార్చి 8, మహా శివరాత్రికి విడుదల కానుంది. 'భీమా' సినిమా గురించి గోపీచంద్ మాట్లాడుతూ 'ఈ సినిమా అన్ని భావోద్వేగాలు కలగలిపిన ఒక వాణిజ్యపరమైన సినిమా. తప్పకుండా ఆడుతుంది అనే నమ్మకం మాత్రం వుందని చెప్పారు. దర్శకుడు హర్ష ఈ కథ నాకు చెప్పేటప్పుడు, భీమా పాత్రకి నేను బాగా కనెక్ట్ అయ్యాను. ఇంతకు ముందు పోలీసాఫీసర్ పాత్రలు చేసినా అందులో కథ అంతా ఆ పోలీసు పాత్ర చుట్టూ తిరుగుతాయి, కానీ ఇందులో అలా కాదు, వేరేలా ఉంటుంది, ఒక చిన్న సెమి ఫాంటసీ కూడా ఉంటుంది, ఆ పాయింట్ కొత్తగా ఉండటమే కాకుండా నాకు బాగా నచ్చి ఈ సినిమా చేసాను అని గోపీచంద్ చెప్పారు.'భీమా'లో కూడా రెండు పాత్రలు ఒకటి పోలీసాఫిసర్, రెండోది ఒక శక్తివంతమైన పాత్ర వున్నాయి. 'అఖండ' సినిమాతో ఈ 'భీమా' పోల్చడం నాకైతే మంచిదే అనిపిస్తుంది. ఈ సినిమాలో పోరాట సన్నివేశాలు వున్నాయి, అలాగే వినోదాత్మక సన్నివేశాలు కూడా చాలా వున్నాయి. దీనికితోడు మంచి భావోద్వేగాలు వున్నాయి. పోరాట సన్నివేశాలలో హీరో వెళ్లి పది ఇరవై మందిని కొడితే ప్రేక్షకుడు చాలా బోర్ ఫీల్ అవుతాడు, ఒక సెన్స్ లేకుండా పోతుంది, అదే అందులో ఒక భావోద్వేగం వుండి, ఆ పోరాట సన్నివేశం చేస్తే, చేసేవాళ్ళకి, చూసే వాళ్ళకి కూడా హత్తుకుంటుంది. ఈ సినిమాలో అన్ని అలా కుదిరాయని చెప్పారు. 'లౌక్యం' లాంటి సినిమాలు' అని చెప్పారు. 'లౌక్యం' విజయం సాధించింది. 'భీమా'లో అన్ని ఎలెమెంట్స్ వున్న సినిమా, బాగుంటుంది అనే అనుకుంటున్నా. ప్రతి సినిమా విజయం సాధించాలని ప్రతి నటుడు కష్టపడి చేస్తారు. 'భీమా' సినిమా దర్శకుడు హర్ష ఈ సినిమాలో కథనం, ట్విస్ట్ లు అన్నీ బాగా చూపించగలిగాడు. పాన్ ఇండియా సినిమా కోసం కథ రాసుకుంటే నడవదు, ఎందుకంటే హిందీ ప్రేక్షకులకి, మన ప్రేక్షకులకి చాలా విషయాల్లో వ్యత్యాసం వుంది. ఇప్పుడు ఒక్క ప్రభాస్‌కి తప్పితే ఏ నటుడూ కూడా పాన్ ఇండియా సినిమాలు చెయ్యడం లేదు, ఆ నటులకి కథలు రాయటం లేదు. ఎప్పటికైనా ప్రభాస్ తో మళ్ళీ కలిసి సినిమా చెయ్యాలని వుంది అని చెప్పారు గోపీచంద్. అతనొక్కడితోటే కాదు, మిగతా నటులతో కూడా కథ నచ్చితే సినిమా చేస్తాను అని చెప్పారు.

## అల్లు అర్జున్ నటనంటే ఎంతో ఇష్టం
## నటి సమంత హాట్ కామెంట్స్

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌పై ప్రశంసల వర్షం కురిపించింది అగ్ర కథానాయిక సమంత. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ వీడియోలు వైరల్‌గా మారాయి. ఇటీవల ఓ కాలేజీ ఫెస్ట్‌లో పాల్గొన్న సమంతను కొందరు స్టూడెంట్స్ 'నటనలో మీకు స్ఫూర్తి ఎవరు?' అని అడిగారు. 'యాక్టింగ్‌లో నాకు అల్లు అర్జున్ స్ఫూర్తి అని సమాధానమిచ్చింది. తనతో కలిసి మరోసారి సినిమా చేయాలనుకుంటున్నా. ఎందుకంటే యాక్టింగ్ బీస్ట్‌గా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు బన్నీ' అని ఆమె అన్నారు. ప్రస్తుతం ఈ వీడియోలను బన్నీ ఫాన్స్ సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. గతంలోనూ ఓ సందర్భంలో సమంత ఇదే విషయాన్ని చెప్పింది. అల్లు అర్జున్ తన సూపర్ హీరో అని చెప్పింది. వీళ్లిద్దరూ కలిసి 'సన్ ఆఫ్ సత్యమూర్తి'లో నటించారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన ఆ సినిమా చక్కని విజయాన్ని అందుకొంది. అలాగే సుకుమార్ డైరెక్షన్‌లో వచ్చిన 'పుష్ప'లో అల్లు అర్జున్, సమంత 'ఊ అంటావా..' పాటకు స్టెప్పులేశారు. ఈ పాట పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల్ని ఓ ఊపు ఊపింది. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'పుష్ప: ది రూల్' రూపొందుతోంది. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ సినిమా ఆగస్టు 15న విడుదల కానుంది. ఇందులోనూ ఓ ఐటెమ్ సాంగ్ ఉందని టాక్. అయితే ఇందులో ఆ పాటలో సమంత కనిపిస్తారా లేక వేరే హీరోయిన్ ఎవరైన కనిపిస్తార అన్నది తెలియాల్సి ఉంది.




## శరవేగంగా దేవర చిత్ర నిర్మాణం

యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'దేవర' కొరటాల శివ దర్శకుడు. కొంతగ్యాప్ తర్వాత మళ్లీ ఈ చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుగుతుంది. రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన ప్రత్యేక సెట్‌లో కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు దర్శకుడు శివ. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే సన్నివేశాలను ఎన్టీఆర్, మురళీశర్మ తదితరులపై చిత్రీకరణ చేస్తున్నారు. దాంతోపాటు పలు యాక్షన్ సన్నివేశాలు కూడా అక్కడ ప్లాన్ చేశారు. ఈ చిత్రంలో ప్రతినాయకుడిగా నటిస్తున్న బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ ఓ ప్రమాదంలో గాయాలపాలు కావడంతో ఆయన కొద్దిరోజులుగా రెస్ట్‌లో ఉన్నారు. కోలుకుని సెట్‌లో అడుగుపెట్టడానికి ఇంకాస్త సమయం పడుతుందని సమాచారం. ఆయన కోసమే షూటింగ్‌కు కాస్త గ్యాప్ ఇచ్చారు. ఆలస్యం కావడంతో ప్రస్తుతం తారక్‌తోపాటు ఇతర తారాగణంపై గ్రామీణ నేపథ్యంలో సాగే సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. రెండు భాగాలుగా ప్లాన్ చేసిన ఈ చిత్రం మొదటి పార్ట్‌ను ఈ ఏడాది ఏప్రిల్ 5న విడుదల చేయాలనుకున్నారు. కానీ పలు కారణాల చేత అక్టోబర్ 10 తేదీకి వాయిదా పడింది. ఇందులో ఎన్టీఆర్ సరసన జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే ఆమెపై కీలక సన్నివేశాలు షూట్ చేశారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధా ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి మిక్కిలినేని సుధాకర్, కొసరాజు హరికృష్ణ నిర్మాతలు. దేవి శ్రీ ప్రసాద్ నిర్మిస్తున్నారు.



Printed,Published by,Owened by **GADDAM NAGARAJU &** Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad **RNI. NO TELTEL/2022/83463 &** Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
**EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com**